
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 13 జూలై 2024 | 3





చెత్తకు చోటిదేనా : రాజమహేంద్రవరంలో రోడ్డు పక్కనే వేసిన చెత్త

ఇలాగుంటే రావా, రోగాలు



చూడండి..మంత్రి గారూ : నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే దారిలో అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ



డ్రెయినేజీ ఏదీ : తాళ్లపూడి మండలంలోని ఒక గ్రామంలో డ్రెయినేజీ లేకపోవడంతో రోడ్డుపైనే మురుగు



కలెక్టరమ్మా.. ఇదమ్మా : ధవళేశ్వరం పంచాయతీ దగ్గరలో ఉన్న మురుగు కాలువ ఇది.. ఏ కాలంలో చూసినా ఇంతే.. ఎవరికీ పట్టదంతే..

పల్లెలు..పట్టణాలు కంపు కొడుతున్నాయ్..

- వణికిస్తున్న సీజన్
- ప్రబలుతున్న డయేరియా
- అధ్వానంగా గ్రామాలు
- నిర్లక్ష్యం వీడని అధికారులు
- భయంలేకపోవడమే కారణం
- మంత్రిగారి ఇలాఖాలో దారుణం
- ధవళేశ్వరంలో చూస్తే దడదడ
- పట్టించుకోని ప్రత్యేకాధికారి
- నగరంలో కంపు..కంపు
- భయంభయంగా జనం
- 300 పంచాయతీల్లోనూ తీరిది
- ముందస్తు పనులకు వైసీపీ జెల్ల

సీజన్ మారింది.. డయేరియా భయపెడుతోంది.. కలెక్టర్ హెచ్చరికలు చేస్తున్నా గ్రామాల్లో పారిశుధ్య సమస్యకు మోక్షమే కానరావడం లేదు.. గత వైసీపీ ప్రభుత్వంలో ఉన్న నిర్లక్ష్యం అధికారుల్లో నేటికీ వీడలేదు.. ఆ ఎవడొస్తాడు.. ఏం చేస్తాడులే అన్నట్టు అధికారుల తీరు ఉంది.. ఎందుకంటే గత ఐదేళ్లుగా ఎక్కడా బదిలీలు లేవు.. పంచాయతీల్లో ఎక్కడికక్కడ వైసీపీ నాయకుల కనుసన్నల్లో పనిచేసే సిబ్బంది పాతుకుపోయారు.. మామూళ్లకు అలవాటుపడిపోయి మామూలుగా పనిచేసుకుపోతున్నారు. బదిలీలు జరిగితే కానీ భయం రాదు.. ఉన్నతాధికారులు చెప్పేది చెవికెక్కదు. పారిశుధ్య సమస్యకు మోక్షం కలగదు.

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)
జిల్లాలో పట్టణాలు,గ్రామాలు అపారిశుధ్యంతో కొట్టుమి ట్టాడుతున్నాయి.. అడుగడుగునా అపారిశుధ్యమే.. ఇటీవల వచ్చిన కలెక్టర్ ప్రశాంతి..ఒక్క డయేరియా కేసు నమోదు కాకూడదని ఆదేశించారు.. అయితే సీతానగరంలో వరుసగా కేసులు నమోదవుతూనే ఉన్నాయి.. ఈ మేరకు కలెక్టర్ గ్రా మాన్ని సందర్శించారు.ఆమె వస్తున్నారని సమాచారం అం దినా సీతానగరంలో పారిశుధ్యం మెరుగుపర్చలేదంటే ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారనేది అర్థం చేసుకోవచ్చు.. దీనిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసి కార్యదర్శిని సస్పెండ్ చేశారు. ఇటీవల ఒకరు మృత్యువాత కూడా పడ్డారు. అయినా జిల్లా వ్యాప్తంగా ఉన్న అధికారుల తీరులో మాత్రం మార్పులేదు. ఇటీవల ధవ ళేశ్వరంలో పర్యటించి అక్కడి అధికారులపై కూడా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామాలను గాలికొదిలేయడంతో సమస్య వచ్చిపడింది. 14, 15వ ఆర్థిక సం ఘం నిధులను దారి మళ్లించి.. సర్పంచ్‌లతో పాటు పాలకవ ర్గాలను ఉత్సవ విగ్రహాలుగా మార్చేయడంతో పల్లెసీమలు అపారిశుధ్యానికి నిలయంగా మారాయి. జిల్లావ్యాప్తంగా 299 గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేయడానికి డబ్బు లు లేని చిన్న పంచాయతీలు వందకు పైగా ఉండడం గమ నార్హం.రంగంపేట మండలంలో సమస్య ఎక్కువ ఉంది. పంచాయతీ సెక్రటరీల అవినీతి గ్రామాల విధ్వంసానికి ప్రధాన కారణం. పంచాయతీల్లో అయితే చాలా మంది సెక్ర టరీలు డ్రెయినేజీలు క్లీన్ చేశామని..పారిశుధ్య సమస్యలు పరిష్కరించామని.. బ్లీచింగ్,ముగ్గు వంటివి వేశామని చెబు తూ దొంగ బిల్లులు చేసుకునేవారు అనేక మంది ఉన్నారు. ఇదిలా ఉండగా జిల్లా అధికారులు సెక్రటరీల నుంచి నిధులు వసూలు చేసి కొన్ని కార్యాలయాలను ఆధునీకరించుకున్న ఘటనలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో మీకెంత మాకెంత అనే తరహాలోనే పనిచేశారు. నేటికీ ఆ జాడ్యం వీడలేదు.





మంత్రిగారి..ఇలాఖాలోనూ ఇంతే!

నిడదవోలు, జూలై 12 : వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాలకు నేడు పారిశుధ్యం పడకేసింది.దీంతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు.నిడదవోలు మండలంలో సమిశ్రగూడెం మేజర్ పంచాయతీ. సుమారు 10 వేల మంది జనాభా ఉన్న గ్రామం.వైసీపీ ప్రభుత్వంలో డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయకుండా రోడ్లు వేసిన ఘనత వారిది. వైసీపీ నాయకులే కాంట్రాక్టర్లు కావడంతో అధికారులు అటువైపు కన్నెత్తయినా చూడలేదు. సాక్షాత్తూ సమిశ్రగూడెం ప్రధాన రహదారి నుంచి మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే ఈ రహదారిపై డ్రైనేజీ నీరంతా ప్రవహిస్తుంటుంది. ఇళ్లల్లోని వారు బయటకు రావాలంటేనే హడలెత్తే పరిస్థితి. ఈ నేపథ్యంలో గురువారం మంత్రి కందుల దుర్గేష్ ఆ రహదారిలో మురుగు పరిశీలించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే డ్రైనేజీలో సిల్ట్ తొలగించి శుభ్రం చేయించాలని ఆదేశించారు.

డ్రెయినేజీల్లేని తాళ్లపూడి

తాళ్లపూడి, జూలై 12 : తాళ్లపూడిలో పలు ప్రధాన వీధు లు చెత్తతో నిండి దుర్గంధం వెదజల్లుతున్నాయి. మండలంలో వేగేశ్వరపురం నుంచి తాడిపూడి గ్రామం వరకూ యేటి గట్టు వెంబడి ఉన్న ప్రతి గ్రామం అపారిశుధ్యంతో నిండి ఉంది. ఇప్పటికైనా శానిటేషన్ అధికారులు పరిశీలించి వాటిని శుభ్రం చేయించాలని పలువురు కోరుతున్నారు.

ఆర్‌డీవో పాలనలో ఉన్నా.. ధవళేశ్వరంలో కంపు..కంపు

ధవళేశ్వరం, జూలై 12 : కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉంది.. ఆర్‌డీవో స్థాయి అధికారి ప్రత్యేకాధికారిగా ఉన్నారు.. ఆదాయం ఉన్నా ఆ గ్రామం చెత్తతోనే ఉంటుంది. అయినా కన్నెత్తి చూసేవారు లేరు..అదే ధవళేశ్వరం గ్రామం. ఇటీవల కలెక్టర్ ప్రశాంతి పర్యటించి స్థానిక సిబ్బందిపై మండిపడ్డారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ధవళేశ్వరం గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి మురుగునీరు పారక నిలిచిపోవడంతో డ్రైనేజీల నుంచి దుర్వాసన వస్తుంది. లెక్కల్లో ఎంత మంది ఉన్నారో తెలియదు కానీ.. 140 మంది వరకూ పారిశుధ్య సిబ్బంది ఉన్నా ఎప్పుడూ చెత్తతో నిండే ఉంటుంది. డ్రైనేజీలు సిల్ట్‌తో నిండే ఉంటాయి. ప్రణాళికాబద్ధంగా పనులు చేయించాల్సిన శానిటరీ సూపర్‌వైజర్ల నిర్లక్ష్యం, కార్యదర్శి అలసత్వం కారణంగా ప్రజలు అపారిశుధ్య పరిస్థితుల మధ్య జీవనం సాగిస్తున్నారు. సోమవారం గ్రామంలో పర్యటించిన కలెక్టర్, ఎమ్మెల్యే పారిశుధ్య పరిస్థితి మురుగునీరు పారని డ్రైనేజీ వ్యవస్థను చూసి కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రూ.3 కోట్లతో మురుగునీటి కాలువల నిర్మాణానికి కార్యాచరణ ప్రణాళిక చేపడుతున్నట్టు ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి ప్రకటించారు. ప్రతి ఏడాది వర్షాకాలం ముందు పారిశుధ్య పనులు చేస్తూనే ఉంటారు..ఎంతో కొంత మేత మేస్తుంటారు.అయితే అసలు సమస్యను మాత్రం గాలికొదిలేసి కొసరు సమస్య చేస్తున్నారు. ధవళేశ్వరంలో మురుగునీటి పారుదల సక్రమంగా ఉండాలంటే కోరీ కాల్వ శుభ్రం చేయించాల్సిందే. ఎందుకో మరి ఏనాడు అటువైపు కన్నెత్తి కూడా చూడరు.నేడూ అదే చేస్తున్నారు. డ్రెయినేజీలపై ఆక్రమణలు తొలగించి సిల్ట్ తీయి స్తున్నారు.. ఇంత వరకూ బాగానే ఉన్నా..కోరీ కాల్వను కూడా శుభ్రం చేయిస్తే సమస్య తీరుతుందని గ్రామస్థులు చెబుతున్నారు.



సిల్ట్ తీయరా : రాపాకలో సిల్ట్‌తో నిండిన డ్రెయినేజీ

ఒకరు చనిపోయినా..మారలే!

సీతానగరం, జూలై 12 : డయేరియా కేసులతో సీతానగరం భయపడుతుంటే సమీప పంచాయతీలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాపాక పంచాయతీ పరిధిలోని రహదారులు డంపింగ్ యార్డులుగా కనిపిస్తుంటే డ్రైనేజీలు నీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతున్నాయి.పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా ఉన్న డ్రైనేజీలో మంచినీటి పైప్‌లైన్ ఊడి పంచాయతీ నీరు డ్రైనేజీలోకి పోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు.దీనివల్ల మంచినీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన చెందు తున్నారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పారిశుధ్యం మెరుగుపర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

ముంపున రాజమహేంద్రి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 12 : రాజమహేంద్రవరంలో ప్రధాన డ్రెయినేజీలన్నీ సిల్ట్‌తో నిండి ఉన్నాయి..సీజన్ మారుతున్నా గత ప్రభుత్వంలో ఎటువంటి ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో డ్రెయినేజీలు చెత్తతో నిండిపోయి ఉన్నాయి. నగరంలో ముఖ్యమంగా కృష్ణనగర్, ఆదెమ్మదిబ్బ, రామచంద్రరావుపేట, తుమ్మలోవ ప్రాంతాలు పెద్దపెద్ద డ్రెయినేజీల మధ్యలో ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో డ్రెయినేజీలు ప్రస్తుతం సిల్ట్‌తో నిండిపోయి ఉన్నాయి. అందువల్ల చిన్నపాటి వర్షానికే ఆయా డ్రైనేజీలు పొంగి పొర్లి రోడ్లపై ప్రవహిస్తోంది.సిల్ట్ పేరుకుపోయి పాకు డు కట్టి కంపుకొడుతోంది.సాధారణ రోజుల్లో ఇబ్బంది లేకపోయినా వర్షాకాలంలో మాత్రం ఆయా ప్రాంత వాసులు నరకం చూస్తారు. ఇక్కడ తాగునీటి పైప్‌లైన్లు డ్రైనేజీల గుండా ఉంటాయి. అందు వల్ల ఎక్కడ లీకేజీ ఉన్నా మొత్తం మురుగునీరు వెనక్కిలాగి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.కూటమి ప్రభుత్వం లోనైనా సమస్య పరిష్కరించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



ఇదేం డ్రెయినేజీ : రాజమహేంద్రి తూర్పు రైల్వే స్టేషన్ వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన డ్రెయినేజీ

గోకవరం..పారిశుధ్యం కనం!





దారేది : గోకవరంలో అంగన్‌వాడీ సెంటర్ ఎదుట పేరుకున్న మురుగు, అచ్చుతాపురంలో రోడ్డుపై మురుగు

గోకవరం, జూలై 12 : మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. అసలే వర్షాకాలం. వైరల్, మలేరియా, డెంగీ జ్వరాలతో ఇప్పటికే పలువురు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. డ్రైనేజీల నుంచి మురుగునీరు పారే దారిలేక ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోతుంది. దీంతో దోమలు విస్తారంగా వృద్ధి చెందుతున్నాయి. . రహదారులపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రజలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా పంచాయతీ పాలకులు, అధికారులు మాత్రం పారిశుధ్యంపై దృష్టి సారించడంలేదు.

చీపురుగూడెంలో ఛీ..ఛీ

నల్లజర్ల,జూలై 12 : ఒక వైపు డయేరియా విజృంభణ చేస్తున్నా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడడం లేదు. పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం,చెత్త సేకరణలో అలక్ష్యం వంటి కారణాలతో గ్రామాలు కంపుకొడుతున్నాయి.చీపురుగూడెంలో ప్రధాన రహదారి వెంబడి డ్రైనేజీ నీరు వెళ్ళే మార్గం లేక కంపుకొడుతుంది. సైకిల్ షాపు లక్ష్మణరావు వీధిలో నెల రోజుల నుంచి డ్రైనేజీ పొంగి ప్రవాహిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భరించలేం : చీపురుగూడెంలో డ్రెయినేజీ ఇలా

50 శాతమే వరి నాట్లు పూర్తి

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం, జూలై12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటి వరకూ 50 శాతం వరినాట్లు పూర్తయ్యాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.జిల్లాలో మొత్తం 77,817 హెక్టార్లలో వరి ఆయకట్టు ఉండగా 3576 హెక్టార్ల నారు అవసరం అన్నారు. ఇప్పటి వరకూ 3490 హెక్టార్లలో నారు వేశారన్నారు. జిల్లాలో 39,284 హెక్టార్లలో నాట్లు పూర్తయ్యాయని తెలిపారు. విత్తనాలు వెదజల్లే పద్ధతిలో అనపర్తి, బిక్కవోలు, కోరుకొండ, గోకవరం, సీతానగరం, రంగంపేట మండలాల్లో 598 హెక్టార్లలో సాగు చేశారని చెప్పారు. జిల్లాలోని అన్ని మండలాల్లో 38,686 హెక్టార్లలో నాట్లు వేశారన్నారు.కోరుకొండ, గోకవరం మండలాల్లో ఆగస్టు మొదటి వారం వరకూ నాట్లు పడే అవకాశం ఉన్నట్టు చెప్పారు.జిల్లాలో అనపర్తి, రాజమహేంద్రవరం రూరల్, కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల్లో కొన్ని చోట్ల కొద్దిగా జింక్ లోపం ఉంటుందన్నారు. జిల్లాకు 900 మెట్రిక్ టన్నుల జింక్ అవసరమని అంచనా వేశామన్నారు.

పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టండి

రాజమహేంద్రవరం రూరల్, జూలై 12: పంచాయితీలు, అర్బన్ ప్రాంతాల్లో 100 శాతం పన్నులు వసూలు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. పన్నుల వసూళ్ళ, ఉచిత ఇసుక తదితర అంశాలపై శుక్రవారం ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ దినేష్ కుమార్‌తో కలిసి జూమ్ మీటింగ్ నిర్వహించారు.రాజమహేంద్రవరం కార్పొరేషన్, 300 పంచాయతీల్లో రూ.200.27 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా కేవలం రూ.120.19 కోట్లు వసూలు చేశారన్నారు.మిగిలిన మొత్తాన్ని వారం రోజుల్లోగా వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పీఎం విశ్వకర్మ కింద 45 వేల లబ్ధిదారులను నమోదు చేశామన్నారు. వారికి వారం రోజుల పాటు అవగాహన కల్పించాలన్నారు. ఇన్‌చార్జి జేసీ దినేష్ కుమార్ మాట్లాడుతూ ఇసుక సరఫరా సమయంలో భవన నిర్మాణ ప్లాన్ అనుసరించి కేటాయింపులు చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు, మరమ్మతుల విషయంలో టౌన్ ప్లానింగ్ పంచాయతీ అధికారులు ధ్రువీకరణ పత్రం జారీ చేయాలన్నారు. దానికి అనుగుణంగా ఇసుక సరఫరా చేయాలన్నారు.అనధికార లావాదేవీలకు అనుమతిస్తే పంచాయతీ అధికారులను బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. మీటింగ్‌లో డీపీవో డి.రాంబాబు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో డ్రైడే : కలెక్టర్

రాజమహేంద్రవరం, జూలై12(ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల వ్యాప్తి నియంత్రణకు శనివారం జిల్లాలో డ్రైడే పాటిస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్ నుంచి శుక్రవారం ఇన్‌చార్జి జేసీ కె.దినేష్‌కుమార్‌తో కలిసి జిల్లాలోని అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.శాఖల మధ్య సమన్వయం ఎంతో కీలకమని అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇక ప్రతి శుక్రవారం డ్రైడేగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో శనివారం నీటిని తీసి వేసి 5 నుంచి 6 గంటల పాటు పొడిగా ఉంచాలన్నారు. డివిజనల్ స్థాయిలో శనివారం సీజనల్ వ్యాధులపై సమావేశాలు నిర్వహించాలని, హై సెన్సిటివ్ మండలాలను గుర్తించి, ఆయా ప్రాంతాల ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో అన్ని ఆర్వో యూనిట్ల నీటి నమూనాలు తనిఖీ చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించాలన్నారు.సమావేశంలోడీఎంహెచ్‌వో డా.కె.వేంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డా.ఎన్.పి.పద్మశ్రీ, జిల్లా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డా.కె.లక్ష్మీసూర్యప్రభ, డీఈవో కె.వాసుదేవరావు, డీపీవో డి.రాంబాబు, ఆర్ఎంసీ ఎస్ఈ జి.పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క పులస.. రూ.24 వేలు

కోనసీమలో తొలిసారిగా చిక్కిన చేప





మలికిపురం, జూలై 12 : గోదావరి రంగు మారింది.. పులస వచ్చి పడింది.. మత్స్యకారులకు ఆనందం వేసింది.. ఎందుకంటే పులసకు అంతా ఇంతా డిమాండ్ కాదండోయ్.. చిక్కిందా అదృష్టం వలలో పడినట్టే మరి.. ఎందుకంటే దాని రుచే వేరు.. దాని ధరే వేరు.. సాధారణంగా చేప ధర ఎంత ఉంటుంది.. ఏదైనా వెయ్యి నుంచి రూ.500 మధ్యన ఉంటుంది. అయితే పులస ధర మాత్రం వేలల్లో ఉంటుంది.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం రామరాజులంకలో మత్స్యకారుల వలకు శుక్రవారం పులస ధర తెలుసుకుంటే అయ్యబాబోయ్ అనక మానరు. ఏకంగా 2 కిలోల పులస రూ.24 వేలకు విక్రయించారు. గత వారం రోజులుగా గోదావరికి ఎర్రనీరు రావడం ఆరంభమైంది.. సముద్రం నుంచి విలస గోదావరికి ఎదురు ఈదుకుంటూ వచ్చి ఈ నీటిలో పులసగా మారుతుంది. మత్స్యకారులు పులస కోసం ప్రత్యేకంగా వలలు సిద్ధం చేసి గోదావరిలో వేస్తారు. ఇలాగే శుక్రవారం బర్రే శ్రీను అనే మత్స్యకారుడి వలలో పులస చిక్కింది.ఈ మేరకు సమాచారం ఇవ్వడంతో రెండు కిలోల బరువు ఉన్న ఈ పులసను సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంకకు చెందిన మాజీ సర్పంచ్ బర్రే శ్రీను రూ.24వేలకు కొనుగోలు చేశాడు.

ఎక్కడైనా 'పట్టు' పడతాం..





తేనె పట్టు చెట్లకే పట్టాలని లేదు కదా. అక్కడక్కడా ఇళ్ల వద్దా పట్టు పట్టడాన్ని చూస్తుంటాం. కానీ కాకినాడ స్మార్ట్ సిటీ ఆవరణలో వాటర్ ట్యాంక్‌పై ఎక్కడో శివారున, మెయిన్ రోడ్‌లోని యూనియన్ బ్యాంకు ఆవరణలో పట్టిన ఇన్నేసి తేనె పట్టులు అప్పుడప్పుడూ మాత్రమే ఇలా చూస్తుంటాం.

- ఫొటోగ్రాఫర్, కాకినాడ







రాజమహేంద్రవరం పుష్కరాలరేవు వద్ద 45 అడుగులకు చేరిన గోదావరి వరద.. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్రంలోకి వెళుతున్న వరద నీరు

పెరుగుతున్న గోదావరి వరద

74 వేల క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల

రాజమహేంద్రవరం సిటీ, జూలై 12 : ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరి నదీ వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ప్రతి ఏటా గోదావరికి జూలై, ఆగస్టు నెలల్లో వరదలు వస్తాయి. మహారాష్ట్రలో వర్షాలు కురవడంతో ప్రవాహం సాధారణ స్థాయికి మించి ప్రవహిస్తోంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 74 వేల క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. పుష్కరాల రేవు వద్ద గోదావరి నీటిమట్టం 45 అడుగులకు చేరింది. ఈ నెలాఖరుకు గోదావరి వరద పోటెత్తే అవకాశం ఉంది.

ఆషాఢం.. గోరింటాకు



అలమూరు, జూలై 11: ఆషాఢ మాసం.. ఈ పేరు వినగానే గోరింటాకు గుర్తుకొస్తుంది..ఆషాఢానికి, గోరింటాకుకు ప్రత్యేక బంధం ఉంది. ఆషాఢ మాసంలో కొత్తగా పెళ్లైన యువతులు గోరింటాకు పెట్టుకునే సంప్రదాయం నేటికీ కొనసాగుతూనే ఉంది. వివిధ శుభ కార్యాలయాల్లో పాల్గొనే వారికి అరచేతులకు అలంకరణగా గోరింటాకు పెట్టుకోవడం తెలిసిందే. తొలకరి ఆరంభం ఆషాఢ మాసం కావడంతో గోరింటాకు చిగురిస్తుంది. లేత గోరింటాకు కోసి మెత్తగా రుబ్బి పెట్టుకుంటే బాగా పండుతుంది. పెళ్లికాని అమ్మాయిలకు ఎర్రగా పండితే మంచి మొగుడొస్తాడని పెద్దవాళ్లు ఆటపట్టిస్తుంటే ఆ యువతులు పొంగిపోతారు. ఈ గోరింటాకు ఎర్రగా పండి శరీరఛాయల నుంచి కళ్లకు ఇంపుగా కనిపిస్తాయి. ఆషాఢమాసంలో దొరికే గోరింటాకు లేలేతగా ఉండి శరీరంలో రసం త్వరగా ఇంకి చేతులు, కాళ్లు ఎర్రగా పండుతాయి.

ఎన్నో డిజైన్లలో అలంకరణ

గోరింటాకు పలు రకాలుగా తయారు చేస్తారు. ఈ ఆకును రోటిలో వేసి మెత్తగా రుబ్బుతారు. ఇందులో అనేక రకాల కలుపుతారు. ఇలా తయారైన గోరింటాకుతో చేతులకు చందమామచుక్కలు, నెలవంక, బంతి పువ్వు, వేళ్లచుట్టూ తొడుగులా పెడతారు. పాదాలకు పారాణి పెడతారు. ఈరకంగా గోరింటాకు పెట్టుకోవడం గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా ఉంటుంది. పట్టణాలలో మార్కెట్లో దొరికే గోరింటాకు కోన్‌లతో ఓ రకరకాల డిజైన్లు చేతులకు పాదాలకు పెట్టుకుంటారు.

ఔషధాల గోరింటాకు

గోరింటాకులో సౌందర్య సాధనంగానే కాక ఔషధ గుణాలు కూడా కలిగి ఉంటుంది. కాళ్లు చేతులు అధికంగా నీటిలో నానడం వల్ల పుండ్లు పడుతుంటాయి. నువ్వుల నూనెలో గోరింటాకు వేసి మరిగించి తలకు రాసుకుంటే తలనొప్పి, వెంట్రుకలు తెల్లబడడం తగ్గుతుంది. ఆయుర్వేదంలో గోరింటాకును చర్మరోగాలకు, కాలేయ రోగాలకు, నోటిపూత వంటి రోగాలకు వాడతారు. కీళ్ల నొప్పులు, గోరింటాకు నూనె పైపూతగా వాడితే మంచి గుణం కనబడుతుంది.



సత్యదేవుడి ఆలయంలో హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాద్

సత్యదేవుడి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి ప్రత్యేక పూజలు

అన్నవరం, జూలై 12: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం రాత్రి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్ స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మెట్ల మార్గంలో స్వామివారి సన్నిధికి విచ్చేయడం విశేషం. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీస్సులు అందజేయగా అధికారులు స్వామివారి ప్రసాదం అందజేశారు.



ఈవో రామచంద్రమోహన్‌కు విరాళం అందజేస్తున్న దాత

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి రూ.3 లక్షల విరాళం

అన్నవరం, జూలై 12: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యన్నదాన పథకానికి శుక్రవారం విజయనగరంనకు చెందిన అనుమలశెట్టి సాయి, సరస్వతీ దంపతులు రూ.3 లక్షలు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత ఆలయ ఈవో రామచంద్రమోహన్‌కు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు



'కాశీ వాసీ రావయ్యా' నాటిక ప్రదర్శిస్తున్న దృశ్యం

పోర్టుసిటీ (కాకినాడ), జూలై 12 : అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వానపు నాటిక పోటీలు కొనసాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం స్థానిక సూర్యకళా మందిరంలో నిర్వహించిన నాటిక ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళా రంగంలో నిష్ణాతులైన వాడ్రేవు సుందర్రావు, లండ రుద్రమూర్తి, తాడి సుబ్బారెడ్డిలకు పురస్కారాలు అందజేశారు. రెండో రోజు కార్యక్రమాల్ని సాహితీ స్రవంతి నగర అధ్యక్షుడు మార్ని జానకిరామ్‌చౌదరి ప్రారంభించగా, గోపాల్ ఆర్ సూరాబత్తుల జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు.

అలరించిన నాటిక ప్రదర్శనలు..

ఈ సందర్భంగా ప్రథమ ప్రదర్శనగా విశాఖపట్నానికి చెందిన కళాభినయి సంస్థ ఆధ్వర్యంలో 'కాశీ వాసీ రావయ్యా' నాటిక ప్రదర్శన జరిగింది. ఈ నాటికకు పీటీ మాధవ్ రచన చేయగా, కవిప్రసాద్ దర్శకత్వం వహించారు. ద్వితీయ ప్రదర్శనగా ఎన్‌టీఆర్ జిల్లా వెలగలేరుకు చెందిన వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో 'రాతి' నాటిక ప్రదర్శించారు. ఈ నాటికకు పోలుదాసు శ్రీనివాసరావు దర్శకత్వం వహించారు. తృతీయ కట్రపాడు ఉషోదయ కళానికేతన్ తరపున 'విముక్తి' నాటిక ప్రదర్శించారు. ఈ నాటికకు చెరుకూరి సాంబశివరావు రచన, దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి అచ్యుతరామిరెడ్డి, పంపన దయానందబాబు, ఉపాధ్యక్షులు ఎస్‌వీవీఎస్ఎన్ మూర్తితో పాటు బుర్రా పద్మనాభం, పి శివప్రసాద్, పడాల రవి, నాగిరెడ్డి సతీష్, కె పుల్లారావు పాల్గొన్నారు.

ఏపీ ఆర్‌సెట్‌లో భానురేఖకు 2వ ర్యాంకు



రాయవరం, జూన్12: పీహెచ్‌డీ (డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ) ప్రవేశానికి నిర్వహించిన ఏపీఆర్‌సెట్‌లో రాయవరం సాయితేజా విద్యానికేతన్ అకడమిక్ డైరెక్టర్ తేతల భానురేఖ రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. గత నెల జూన్ 3వ తేదిన తిరుపతి వేంకటేశ్వర యూనివర్సిటీ నిర్వహించిన ఆర్‌సెట్‌లో అర్హత పొందిన అభ్యర్థులకు రాజమహేంద్రవరంలో మౌఖిక పరీక్షలు నిర్వహించారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 10 వేల మంది పట్టభద్రులు పరీక్షకు హాజరుకాగా 146 మార్కులతో రాష్ట్ర స్థాయిలో తాను 2వ ర్యాంకు సాధించానన్నారు. హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్ (హెచ్‌ఆర్ఎం)లో పీహెచ్‌డీ చేయాలనే లక్ష్యంతో తాను పరీక్షలకు హాజరైనట్టు భానురేఖ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించిన భానురేఖను కేవీఆర్ ఆసుపత్రి అధినేత డాక్టర్ తేతలి నవీన్‌రెడ్డి, పలువురు ప్రముఖులు అభినందించారు.

18న ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

కాకినాడ రూరల్, జూలై 12: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఇంటర్ ఒకేషనల్ కోర్సు ద్వారా రెండో ఏడాది డిప్లమో కోర్సులలో మిగిలిన సీట్లకు ఈనెల 18న కాకినాడ ఏపీటీలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఎన్.జనార్దనరావు తెలిపారు. ఐవీసీ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈనెల 16వ తేదీ సాయత్రం అయిదు గంటలలోపు సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తిగల విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలని, ఇతర వివరాలకు 9291621549 నెంబర్లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఫోర్‌బై కెనాల్ వద్ద నీటిలో దిగిన

యువకుడి గల్లంతు



గల్లంతైన యువకుడు మురళీకృష్ణ (ఫైల్‌ఫొటో)

మోతుగూడెం, జూలై12:అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరుకు చెందిన వీరి మురళీకృష్ణ (24) శుక్రవారం సాయంత్రం లోయర్ సీలేరు ప్రాజెక్టు వద్ద ఫోర్‌బై పవర్ కెనాల్‌లో కాలు జారిపడి గల్లంతయ్యాడు. మోతుగూడెం ఎస్ఐ గోపాలరావు తెలిపిన వివరాలు ప్రకారం అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరు నుంచి వీరి మురళీకృష్ణ తన స్నేహితులైన సాయి రాజ్, దుర్గా, లక్ష్మణ్, గౌతమ్‌లతో కలిసి మోతుగూడెం పర్యాటక ప్రాంతాలను చూడటానికి శుక్రవారం వచ్చారు. సాయంత్రం 5 గంటల సమయంలో ఫోర్ బై పవర్ కెనాల్ (పుష్ప బ్రిడ్జి) వద్ద వీరి మురళీకృష్ణ కాలుజారి పడి గల్లంతయ్యాడు. రాత్రి వరకు గల్లంతైన మురళీకృష్ణ ఆచూకీ లభించలేదు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సామర్లకోటలో ప్రమాదానికి గురైన కారు

బ్రిడ్జిపై కారు బీభత్సం

వ్యక్తికి గాయాలు.. సామర్లకోటలో ఘటన

సామర్లకోట, జూలై 12: సామర్లకోట ఓవర్ బ్రిడ్జి దిగువన అవుట్ పోస్టు పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో వేగంగా వెళుతున్న కారు శుక్రవారం బీభత్సం సృష్టించింది. ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్‌ను ఢీకొని ఆ తర్వాత బ్రిడ్జి ఫుట్‌పాత్ మార్గాన్ని ఢీకొని రక్షణ గోడపైకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో మోటార్ సైకిల్‌పై వెళుతున్న హుస్సేన్‌పురంనకు చెందిన కట్టా నూకరాజును కారు వెనుక నుంచి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తి హుస్సేన్‌పురంలో ఆయిల్ కర్మాగారంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుంటాడని పోలీసులు తెలిపారు. బాధితుడిని హుస్సేన్‌పురం టీడీపీ నాయకులు చల్లా బుజ్జి తదితరులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఉన్నత చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారును నడుపుతున్న డ్రైవర్‌కు అంతంత మాత్రంగానే డ్రైవింగ్ రావడం, అనుభవం లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిక్కీలో పెట్టిన రూ.5.20 లక్షలు మాయం

దొమ్మేరులో బండి డిక్కీలో నుంచి కొట్టేసిన వైనం.. బాధితుడి సమాచారంతో విచారణ చేపట్టిన పోలీసులు

కొవ్వూరు, జూలై 12: బైక్ డిక్కీలో పెట్టిన రూ.5.20 లక్షల నగదును దుండగులు అపహరించినట్టు బాధితుడు వాపోయాడు. అనపర్తి మండలం మహేంద్రవాడకు చెందిన కర్రి సూర్యనారాయణరెడ్డి శుక్రవారం చాగల్లులో స్థలం విక్రయించడానికి వచ్చాడు. స్థలం కొనుగోలు చేస్తున్న వ్యక్తి అడ్వాన్సుగా రూ.5 లక్షలు ఇచ్చాడు. సొమ్ము తీసుకుని ఇంటికి బయలుదేరాడు. దొమ్మేరు గ్రామశివారు చౌదరి హోటల్ వద్ద మధ్యాహ్నం 3 గంటల సమయంలో భోజనానికి ఆగాడు. భోజనం చేసి అక్కడే కొంతసేపు కూర్చుని అడ్వాన్సుగా ఇచ్చిన సొమ్ము లెక్క చూసుకున్నాడు. అరగంట తరువాత అడ్వాన్సు సొమ్ము రూ.5 లక్షలు, తన వద్ద ఉన్న రూ.20 వేల నగదును బ్యాగ్‌లో పెట్టి మోటారుసైకిల్ డిక్కీలో పెట్టుకుని మళ్లీ ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో దొమ్మేరులోని టీ టైమ్ వద్ద ఆగాడు. టీ తాగి వచ్చి డిక్కీలో ఉంచిన సొమ్ము చూసుకుంటే డబ్బు బ్యాగ్ కనిపించకపోవడంతో బాధితుడు పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. సమాచారం తెలుసుకున్న సీఐ వి.జగదీశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని సూర్యనారాయణరెడ్డి భోజనం చేసిన హోటల్, టీ తాగిన టీ టైమ్‌తోపాటు మెయిన్‌రోడ్‌లోని దుకాణ యజమానులను, స్థానికులను విచారణ చేశారు. గుర్తుతెలియని యువకుడు చొక్కాలో ఏదో దాచుకుని వెళ్తున్నట్టు చూశామని స్థానికులు పోలీసులకు చెప్పినట్టు సమాచారం.

వచ్చే నెల 25న జాంపేట అర్బన్ బ్యాంక్ ఎన్నికలు

రాజమహేంద్రవరం, జూలై 12(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో అర్బన్ బ్యాంక్‌ల ఎన్నికల సందడి మొదలైంది. ఇప్పటికే ఆర్యాపురం కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ నడుస్తోంది. ఈనెల 20న పోలింగ్ జరగనుంది. మరోపక్క రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆగస్టు 25న ఎన్నికలు జరుగుతాయి. ఆగస్టు 16న నామినేషన్లు స్వీకరిస్తారు. 17న వాటిని పరిశీలించి 18న ఉపసంహరణ ముగిసిన వెంటనే పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి. ప్రశాంతి ఈ నెల 8న నోటిఫికేషన్ జారీచేశారు. ఎన్నికల అధికారిగా రాజమండ్రి డివిజనల్ సహకార అధికారి ఎం.జగన్నాథరెడ్డిని నియమించారు. జాంపేట అర్బన్ బ్యాంక్‌కు 10 బ్రాంచిలు ఉన్నాయి. జాంపేట ప్రధాన బ్రాంచికాగా, మోరంపూడి, ధవళేశ్వరం, సీతంపేట, అనపర్తి, పెద్దాపురం, కాకినాడ, గోకవరం, ఏలూరు, కొవ్వూరుల లో బ్రాంచిలు ఉన్నాయి. దీని పాలకవర్గం కోసం 12 మంది డైరెక్టర్లను ఎన్నుకోవలసి ఉంది. ఈ బ్యాంక్ పరిధిలో మొత్తం 30,815 మంది ఓటర్లు ఉన్నారు.

క్వారీమార్కెట్ రైతుబజార్‌లో ఆనబకాయల రాశులు

ఒక్కో కాయ రూ.17కు విక్రయం



క్వారీ మార్కెట్‌లో విక్రయిస్తున్న ఆనబకాయలు

రాజమహేంద్రవరంఅర్బన్, జూలై12 : ఆనబకాయలు శుక్రవారం మార్కెట్లను ముంచెత్తాయి. దిగుబడికి వాతావరణం పూర్తిగా అనుకూలించడంతో రైతులు భారీఎత్తున ఆనబకాయలను మార్కెట్లకు తీసుకొస్తున్నారు. రాజమహేంద్రవరం క్వారీమార్కెట్ రైతు బజార్‌కు శుక్రవారం సీతానగరం ప్రాంతానికి చెందిన రైతు కూనవరం శ్రీను తన పొలంలో సాగు చేసిన ఆనబకాయలను విక్రయానికి తీసుకొచ్చాడు. భారీగా రాశి పోసి విక్రయాలు సాగించాడు. రైతుబజార్ అధికారులు రైతుకు గిట్టుబాటు ధర కల్పించడానికి ఒక్కో ఆనబకాయకు రూ.17 ధర పెట్టారు. పొలంలో మరిన్ని ఆనబకాయలు కోతకు సిద్ధంగా ఉన్నాయని రైతు శ్రీను తెలిపాడు. ఇలా ఒక్కసారిగా ఇబ్బడిముబ్బడిగా వచ్చే కూరగాయల విషయంలో మార్కెటింగ్‌శాఖ అధికారులు దృష్టి సారించి సర్‌ప్లస్‌గా ఉన్న సరుకును రైతుల నుంచి సేకరించి ఇతర రైతుబజార్లకు సర్దుబాటు చేయగలిగితే అటు రైతుకు, ఇటు వినియోగదారునికి మేలు కలుగుతుందనే భావన వ్యక్తమవుతోంది.

ఎవరీ 'అగంతకులు'

- ఇసుక ర్యాంపుల్లో కొన్నిచోట్ల ఇప్పటికీ దందాలే
- 3 యూనిట్ల లారీకి రూ.1300, 5 యూనిట్లు రూ.2600
- ఇవి ఇసుక ధరలు కాదు.. ప్రజాప్రతినిధుల పేరుతో వసూళ్లు
- చోద్యం చూస్తున్న సూపర్ వైజర్లు, అధికారులు



గోపాలపురం రీచ్ నుంచి ఇసుక తరలిస్తున్న 7 లారీలను పెరవలి సమీపంలో గురువారం పట్టుకున్న పోలీసులు

రాజమహేంద్రవరంసిటీ/రూరల్, జూలై12: రాష్ట్ర ప్రభుత్వం నూతన ఉచిత ఇసుక పాలసీని తెచ్చినప్పటికీ ఇప్పటికీ ఇంకా ఇసుక దందాలు కొనసాగుతున్నాయి. సీఎం చంద్రబాబు చాలా ప్రతిష్ఠాత్మకంగా ఉచిత ఇసుక పాలసీని తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా లాభాపేక్షలేకుండా ఇసుక సరఫరా అత్యంత పారదర్శకంగా జరగాలని వారు ఆకాంక్షించారు. ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. ఇసుక ర్యాంప్‌లకు సంబంధం లేని వ్యక్తులు ర్యాంప్‌లలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇదంతా సంబంధిత అధికారులు, సూపర్‌వైజర్ల సమక్షంలోనే జరుగుతుండడం ఆశ్చర్యకరంగా మారింది. కొంతమంది ఇసుక ర్యాంప్‌లకు సంబంధంలేని వ్యక్తులు జిల్లాలోని మనుగడలో ఉన్న అన్ని ఇసుక ర్యాంప్‌లను అనధికారికంగా పంచేసుకున్నారు. ర్యాంప్ వారీగా టన్నేజీని బట్టి వారికి చెల్లించాల్సిన డబ్బులను వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. ముఖ్యంగా కడియపులంక బుర్రిలంక, ధవళేశ్వరం, గాయత్రి, కోటిలింగాలు, కాతేరు, వెంకటనగరం ఇసుక ర్యాంప్‌లలో 3 యూనిట్ల లారీకి అదనంగా రూ. 1300, 5, 6 యూనిట్ల లారీలకు రూ.2600 చొప్పున డబ్బులు కొంతమంది వ్యక్తులు వసూలు చేయడం విమర్శలకు తావిస్తోంది. ఇసుక కోసం వచ్చే వినియోగదారులు ర్యాంప్‌ల వద్దకు వచ్చి టన్ను రూ.420కు కొనుగోలు చేసుకుని కిరాయితో కలిపి ఇంటికి చేర కింద వారు వేసుకున్న అంచనాలకు అక్కడ అదనంగా ప్రజాప్రతినిధుల పేరుతో అదనపు వసూళ్ల చేస్తున్న తీరుకు సగటు వినియోగదారులు అవాక్కవుతున్నారు. వాస్తవానికి ర్యాంప్‌లలో ఇసుక టన్నుకు రూ.420 చొప్పున పది టన్నులకు రూ.4200, ఇరవై టన్నులకు రూ.8400 చొప్పున ఆన్‌లైన్ లింక్ ద్వారా వినియోగదారులు చెల్లింపులు చేస్తున్నారు. దీనికి అదనంగా కొంతమంది లారీ డ్రైవర్లు వినియోగదారుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. వాస్తవానికి ఇసుక కావాలంటే వినియోగదారుడు లారీ డ్రైవర్, ఓనర్లను సంప్రదిస్తారు. ఇప్పుడు ఇంటిప్లాన్‌లు, ఆధార్ కార్డులను ఇసుక కావాల్సిన వారి వద్ద నుంచి తీసుకుంటున్న డ్రైవర్లు ఇసుక, రవాణాకు కలిసి వినియోగదారుల నుంచి డబ్బులు తీసుకుని ర్యాంప్‌లకు వచ్చి అక్కడ ఆన్‌లైన్ పేమెంట్స్ చేసి ఇసుక వినియోగదాలకు చేరుస్తున్నారు. నేరుగా చెల్లించిన ఇసుక పట్టుకెళ్లేందుకు వచ్చేవారు తక్కువ. ఈనేపథ్యంలో ఆన్‌లైన్ పేమెంట్ కాకుండా కొంతమంది ర్యాంపులో అదనంగా 20 టన్నులకు రూ.2600 వసూలు చేస్తుండడంతో లారీ డ్రైవర్లు చిక్కుల్లో పడుతున్నారు. అదనంగా వసూలు చేసిన భారం వినియోగదారుడుపై వేస్తే వాళ్లు ఒప్పుకోవడంలేదు. ర్యాంపులోనే ఈ సొమ్ములు కట్టాల్సి వస్తోందని చెబుతున్నా వినియోగదారులు వినడం లేదని డ్రైవర్లు వాపోతున్నారు. ఇలా ఇసుక ర్యాంప్‌లలో కొందరు ప్రజాప్రతినిధుల మనుషులం అంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతుండడం విమర్శలకు దారితీస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ప్రజలకు ఇసుకను అందిస్తుంటే కొంతమంది ఇలా అక్రమ వసూళ్లకు దిగడంపై పలువురు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. ఇసుక ర్యాంప్‌లలో సూపర్‌వైజర్లుగాను, ఇతర బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులు సైతం ఈ అదనపు వసూళ్లను అడ్డుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఉచిత ఇసుక ఉద్దేశానికి తూట్లు పొడిచే ఇలాంటి చర్యలపై దృష్టిపెట్టాలని పలువురు కోరుతున్నారు. అలాగే కొన్ని రీచ్‌ల నుంచి బిల్లులు లేకుండా ఇసుక తరలిపోతోందనే ఆరోపణలు వినవస్తున్నాయి. రెండు రోజుల కిందట పెరవలి సమీపంలో ఏడు లారీల్లో 150 టన్నుల ఇసుక తరలిస్తుండగా అధికారులు, పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. ఇప్పటికైనా అధికారులు ఇటువంటి వాటిపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

ఏజెన్సీ సమాచారం


ఇందుకూరుపేటలో పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న శిరీషాదేవి

టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

దేవీపట్నం, జూలై 12: మండలంలోని ఇందుకూరుపేట గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు విజయభాస్కర్ శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తొలిసారిగా దేవీపట్నం మండలంలోకి రావడంతో కూటమి నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఫజుల్లాబాద్‌లో శ్రీవల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండల అధికారులు ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. దీనిలో భాగంగా వీఆర్ఏలు తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి పోలవరం నిర్వాసితుల సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. అలాగే పలు సమస్యలను రాష్ట్ర ఆదివాసీ నాయకుడు తెల్లం శేఖర్ ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మట్ట మెహెర్‌బాబా గౌడ్, నగేష్, ముచ్చు నాగేశ్వరరావు, నక్కా హరిశ్చంద్రుడు, త్రిమూర్తులు, గౌరీశ్వరి, రేలంగి రాంబాబు, కనకం, అంజిరెడ్డి, సత్యనారాయణ, బాబురావు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న దృశ్యం

డొంకరాయిలో మొక్కలు నాటే కార్యక్రమం

మోతుగూడెం, జూలై 12: డొంకరాయిలో ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్-2024 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సీఆర్పీఎఫ్ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ కేఎస్ఎస్ సుబ్రమణి, డొంకరాయి ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు, ప్రవీణ్, కాత్యాయని, స్కూల్ సిబ్బంది, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడదాం..

దేవీపట్నం, జూలై12: మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదామని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని దేవారం పంచాయతీ పరిధిలో పోతవరంలో ఇందుకూరుపేట సొసైటీ మాజీ చైర్మన్ తుర్రం రామకృష్ణదొర ఆధ్వర్యంలో వారి తల్లి జ్ఞాపకార్థం మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరూ ఏదైనా కార్యక్రమం సందర్భంగా మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని ఆయన కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేలా చర్యలు : ఐటీడీఏ పీవో

రంపచోడవరం, జూలై 12: ఏజెన్సీ ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిష్కరించేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో డీడీ జాన్‌రాజ్‌తో కలిసి ఏడు మండలాల ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలను నియమించాలని, జీవో నెం.1 ప్రకారం అర్హులైన ఉపాధ్యాయులకు డీఈవోలుగా ప్రమోషన్లు కల్పించాలని, పాఠశాలల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు మూడు మండలాల పాఠశాలలకు ఒక ఎలక్ట్రీషియన్‌ను నియమించాలని, 77 మంది సెకండ్‌గ్రేడ్ ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్లు మంజూరుచేయాలని, ఏజెన్సీలో స్పెషల్ డీఎస్సీ ఏర్పాటుచేయాలని తదితర సమస్యలను పీవోకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవోలు రామతులసి, విజయశాంతి, ప్రసాద్, సూపరింటెండెంట్ బి.కిషోర్, సీనియర్ అసిస్టెంట్లు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, చక్రధర్, ఉపాధ్యాయ సంఘాల నేతలు కె.రంగారావు, బి.మంగిరెడ్డి, కత్తుల ఆదిరెడ్డి, కరుణావిలాస్, కె.సూరిబాబు, బి.కృష్ణ, వై.విల్సన్, ఎల్.వేణుగోపాల్, జి.భూషణం, కె.రాంబాబు, కేఆర్‌పీ కుమార్, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

'వరదల సమయంలో అధిక రేట్లు అమ్మితే చర్యలు'

వరరామచంద్రాపురం, జూలై12: గోదావరి వరదల సమయంలో వ్యాపారస్తులు అధిక ధరలకు నిత్యావసరాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ సయ్యద్ మౌలానాఫాజిల్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వ్యాపారస్తులందరితో తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి వరదల సమయంలో నిత్యావసర సరుకులు, కూరగాయలు, పాలు, పెట్రోలు, డీజిల్, మటన్, చికెన్ వంటివి ఎక్కువ ధరలకు అమ్మితే ఆ వ్యాపారులపై కఠినమైన చర్యలు తీసుకోవడమే కాకుండా కేసులు పెడతామని హెచ్చరించారు.

ముంపు గ్రామాలు సందర్శించిన ఐటీడీఏ పీవో

కూనవరం, జూలై12: గోదావరికి ముంపునకు గురయ్యే గ్రామాలను చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య సందర్శించారు. గోదావరి వరదలు వస్తే ముందుగా కూనవరం మండలంలో ముందుగా ముంపునకు గురయ్యే గ్రామం శబరికొత్తగూడెం అని అధికారులు పీవోకు వివరించారు. దీంతో మొదట ముంపునకు గురయ్యే గ్రామాలతోపాటు అన్ని గ్రామాలకు సౌకర్యాలు కల్పించాలని పీవో అధికారులను ఆదేశించారు. గోదావరి వచ్చిన సమయంలో విద్యుత్ అంతరాయం కలగకుండా సరఫరా చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. పోసుగూడెం జంక్షన్ నుంచి వయా తెల్లవారిగూడెం వరకు తాత్కాలిక రహదారిని త్వరితగతిన పూర్తి చేయాలని పీవో అధికారులను ఆదేశించారు. అనంతరం పీవో కోతులగుట్ట పునరావాస కేంద్రంలో మొక్కలు నాటారు. ఎంపీడీవో కార్యాలయంలో వరద సమీక్షా సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తా : ఎమ్మెల్యే

రంపచోడవరం, జూలై 12: ప్రజల నుంచి అందిన ప్రతి దరఖాస్తును పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఎం.శిరీషాదేవి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు ఎం.విజయభాస్కర్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కొన్ని సమస్యలను అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించారు.

అక్రమ మద్యం ధ్వంసం

మోతుగూడెం, జూలై12: డొంకరాయి, చింతూరు పోలీస్‌స్టేషన్లలో నమోదైన వివిధ కేసుల్లో పట్టుబడిన స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యాన్ని శుక్రవారం ధ్వంసం చేశారు. ఎస్పీ తుహిన్ సిన్హా ఇచ్చిన ఆదేశాల మేరకు చింతూరు సబ్ డివిజన్ పోలీస్ అధికారి రాహుల్‌మీనా, అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో మధ్యవర్తులైన మునుగూరు వీఆర్వో గొంది మోహన్, సవరం సంతోష్ సమక్షంలో డొంకరాయి ఎస్ఐ శివకుమార్, చింతూరు ఎస్ఐ ఆర్ వెంకటేషులు సిబ్బంది శుక్రవారం సాయంత్రం చింతూరు గ్రామ శివారులో రాయల్ ఛాలెంజర్స్ 17, మ్యాన్షన్ హౌస్ 13, కింగ్‌ఫిషర్ బీర్లు 348, ఓల్డ్ అడ్మిరల్ 11, సారా 30 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో చింతూరు సీఐ గజేంద్రకుమార్ కూడా పాల్గొన్నారు.

తాడి సుబ్బారెడ్డికి కళాపురస్కారం

అనపర్తి, జూలై 12: మండలం పొలమూరుకు చెందిన రంగస్థల నటుడు తాడి సుబ్బారెడ్డికి కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి నాటిక పోటీల సందర్భంగా అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో కళాపురస్కారం అందించారు. అంతరించిపోతున్న నాటక రంగానికి జీవం పోస్తూ సుబ్బారెడ్డి చేస్తున్న కళాసేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్ర మంలో పరిషత్ గౌరవాధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, కర్రి అచ్చుతరామారెడ్డి, శా రదా కళానికేతన్ ప్రతినిధులు సత్తి వీర్రాఘవరెడ్డి, మల్లిడి నాగిరెడ్డి, తాడి శ్రీనివాసరెడ్డి, తాడి సతీష్‌రెడ్డి అభినందించారు.

ప్రజారోగ్య సంరక్షణే కూటమి ప్రభుత్వ ధ్యేయం


25వ డివిజన్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

» 25వ డివిజన్ పర్యటనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 12: ప్రజారోగ్య సంరక్షణే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 25వ డివిజన్‌లో మంగళవారపుపేట, కంచుమర్తివారి వీధి వరకు శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. నగరంలో పూర్తిస్థాయిలో శానిటేషన్ చర్యలు చేపట్టాలన్నారు. పది రోజుల్లో చేపట్టిన పనులు పూర్తి చేయాలన్నారు. ఈ ప్రాంతంలో శానిటేషన్, తాగునీరు, వీధి దీపాలు, కుళాయి, అంతర్గత రహదారులు, కల్వర్టులు వంటి సమస్యలు ఉన్నాయన్నారు. ఆయన వెంట టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, నాయకులు కురగంటి సతీష్, నల్లం శ్రీను, కార్పొరేషన్ అధికారులు ఉన్నారు.

రాజేంద్రనగర్‌లో మీ భద్రత మా బాధ్యత

నగరంలోని 3,4 డివిజన్ల పరిధిలోని రాజేంద్రనగర్ 12 కుళాయిల సెంటర్‌లో శుక్రవారం రాత్రి మీ భద్రత-మా బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, రాజమహేంద్రవరంలో మహిళలకు పూర్తి భరోసా కల్పిస్తున్నామన్నారు. మహిళలు తన ఫోన్ నెంబరు 86939 34567కు నేరుగా కాల్ చేసి సమస్య చెబితే పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే వాసును టీఎన్‌టీయూసీ జిల్లా మాజీ అధ్యక్షుడు నక్కా చిట్టిబాబు సత్కరించారు. వన్‌టౌన్ సీఐ, పోలీస్ అధికారులు, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విధానాలతో వరిలో మేలైన దిగుబడులు

» ఏరువాక కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ నరసింహారావు

రంగంపేట, జూలై 12: శాస్త్రీయ విధానాలు పాటిస్తే సార్వా వరిలో మేలైన దిగుబడులు వస్తాయని జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. శుక్రవారం మండలంలోని వడిశలేరులో జరిగిన రైతు సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని, నాటిన తొలినాళ్లలో ఎరువులు సమతుల్యంగా వేసి, సమగ్ర కలుపు నివారణ, సమగ్ర చీడపీడల నివారణ చేసుకుంటే నాణ్యమైన, స్థిరమైన వరి దిగుబడులను పొందవచ్చన్నారు. వచ్చే దాళ్వాకు ఇక్కడి రైతులకు కొత్త మినుము, పెసర, శెనగ విత్తనాలు సీజనుకు ముందే అందిస్తామన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసి టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్ మాట్లాడుతూ రైతులకు కావల్సిన విత్తనాలను సకాలంలో అందజేయాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా రైతులకు మినీ కిట్స్ పంపిణీ చేశారు. వ్యవసాయాధికారులు వరిలో కలుపు నివారణ, శెనగ పంట పండించే పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పోతుల వెంకటరాజు, మాచిన వెంకన్నదొర, ఉప్పలపాటి బుల్లిదొర, చావశ్రీనివాస్, బుద్ది వరప్రసాద్, ఎంపీడీవో పి.వెంకటరత్నం, ప్రధాన శాస్త్రవేత్తలు పి.అమ్మాజీ, ఎస్.హైమావతి, ఏవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


రైతులకు మినీ కిట్స్ పంపిణీ చేస్తున్న గోవింద్, నరసింహారావు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

» టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్
» పలు పాఠశాలల్లో స్టూడెంట్ కిట్స్ పంపిణీ

రంగంపేట, జూలై 12: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న విద్యా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత ఉద్యోగులుగా ఎదగడానికి బాల్యం నుంచి కృషిచేయాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్ సూచించారు. శుక్రవారం మండలంలోని వడిశలేరు జడ్పీ హైస్కూల్లో హెచ్ఎం దాట్ల అరుణ అధ్యక్షతన జరిగిన స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సీఎం చంద్రబాబు విద్యాశాఖామంత్రి లోకేశ్ విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని, దశల వారీగా సమస్యలు పరిష్కరించి విద్యారంగంలో అభివృద్ధి ఫలాలు సాధించడానికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొల్లాటి శ్యామలావతి, టీడీపీ నాయకులు పోతుల వెంకటరాజు, మాచిన వెంకన్నదొర, జనసేన నాయకుడు బుద్ది వరప్రసాద్, ఎంపీడీవో పి.వెంకటరత్నం, ఎంఈవో-2 పి.మధుసూదనరావు పాల్గొన్నారు. అలాగే రంగంపేట హైస్కూల్లో జరిగిన స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, మాణిక్యం, ఉండవిల్లి గిరిబాబు, బీజేపీ మండలాధ్యక్షుడు మైలవరపు సాయిరాం, హెచ్ఎం పి.పార్థసారథి పాల్గొన్నారు. అచ్యుతాపురంలో ఎంపీపీ స్కూల్లో టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి నీలపాల త్రిమూర్తులు, సింగంపల్లి హైస్కూల్లో జడ్పీటీసీ పేపకాయల రాంబాబు స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఎంఈవో కె.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్ చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, ఇందల వీరబాబు, వైదాడి వెంకటేశ్వరరావు, హెచ్ఎం పి.ప్రభాకరరావు పాల్గొన్నారు. కొంకుదురు ఉన్నత పాఠశాలలో టీడీపీ మండలాధ్యక్షుడు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చింతా శ్రీనివాసరెడ్డి, ఉపసర్పంచ్ సత్తి తాతారెడ్డి, పీఎంసీ చైర్‌పర్సన్ కోరుకొండ లక్ష్మి, హెచ్ఎం ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కడియం: జేగురుపాడు జీవీకే ఉన్నత పాఠశాలలో జరిగిన విద్యాకిట్లు పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ యాదల స్టాలిన్, గారపాటి అమరనాథ్, ఉపసర్పంచ్ పాతూరి రాజేష్, ఎంపీటీసీలు నాగిరెడ్డి రామకృష్ణ, ఆకుల సుధాకర్, హెచ్ఎం సురేష్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో స్వచ్ఛత ర్యాలీ



వాక్తాన్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 12: రాజమహేంద్రవరంలో ఆదిత్య డిగ్రీకళాశాలకు చెందిన 150 మంది ఎన్ఎస్ఎస్ ,యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు దీప్తి సొసైటీ నిర్వహణలో శుక్రవారం స్వచ్ఛత పక్వడ్ వాక్తాన్ ర్యాలీ నిర్వహించారు. కంబాలచెరువు పార్కు నుంచి పుష్కరాల రేవు వరకు నిర్వహించిన ఈ ర్యాలీని ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శంతను దాస్ ప్రారంభించారు. ఎవాయిడ్ ప్లాస్టిక్ -సేవ్ లైఫ్ క్లీన్ ఇండియా -గ్రీన్ ఇండియా వంటి నినాదాలతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఆదిత్య డైరెక్టర్ ఎస్‌పి గంగిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జీవీఎస్.నాగేశ్వరరావు, డాక్టర్ బీహెచ్‌వీ.రమాదేవి, ఆదిత్య సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ శిక్షణ కార్యక్రమం

కడియం, జూలై 12: రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ కోఆర్డినేటర్ వైప్రకాష్‌కుమార్ ఆధ్వర్యంలో కడియం ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన జూనియర్ రెడ్‌క్రాస్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. చిన్నతనం నుంచి సేవాభావం కలిగి ఉండాలన్నారు. నోడల్ ఆఫీసర్ గొల్లపల్లి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాలకు బస్సులు నడపండి

ఆర్టీసీ జిల్లా మేనేజర్‌ను కలసిన ఎమ్మెల్యే బత్తుల


వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజమహేంద్రవరం అర్బన్/రాజానగరం, జూలై 12: రాజానగరం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల అశోకను శుక్రవారం రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక వినతిపత్రం అందజేశారు. పాత తుంగపాడు వయా హౌసింగ్‌బోర్డు కాలనీ, దివాన్‌చెరువు, శ్రీరాం పురం, శ్రీకృష్ణపట్నం, రాధేయపాలెం మీదుగా పాత తుంగపాడు వరకూ బస్సు నడపాలన్నారు. కోరుకొండ నుంచి కాపవరం, మునగాల, కూనవరం, ముగ్గళ్ల, రఘుదేవపురం మీదుగా సీతానగరం వరకూ, గోకవరం నుంచి బుచ్చింపేట, మిర్తిపాడు రాజమహేంద్రవరం వెళ్లేందుకు బస్సులను నడపాలన్నారు. రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్బాం, సూపర్‌వైజర్ రాజబాబు, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో జేమ్స్ కోరే జయంతి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 12: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం ప్రఖ్యాత రసాయనశాస్త్రవేత్త ఈజే కోరే (జేమ్స్ కోరే) జయంతిని నిర్వహించారు. రసాయనశాస్త్ర విభాగం ఇన్‌చార్జి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈజే కోరె రసాయనశాస్త్రంలో అనితరసాధ్యమైన పరిశోధనలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ప్రిన్సిపాల్ ఎంవీ రామకృష్ణారావు, సీనియర్ అధ్యాపకులు బి.వెంకట్రావు, కె.వెంకట్రావు, నరసింహమూర్తి, బేబీ నిర్మల, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కడియం, జూలై 12: వార్షిక మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని వేమగిరి, కడియం, జేగురుపాడు గ్రామాలకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన గన్ని కృష్ణ



రాజమహేంద్రవరం సిటీ, జూలై 13: సీఎం చంద్రబాబును టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడ సచివాలయంలో శుక్రవారం రాత్రి చంద్రబాబును కలిసి చంద్రబాబు దంపతులున్న చిత్రపటానికి బహూకరించారు.

లలితాదేవికి ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతుల పూజలు



అనపర్తి, జూలై 12: మన్యం జిల్లా మక్కువ మండలంలోని సాపయ్యవలసలో వారాహి నవరాత్రుల సందర్భంగా లలితాదేవి పీఠంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేశా రు. పీఠాధిపతులు ఎమ్మెల్యే దంపతులతో అమ్మవారికి పూజలు చేయించి ఆశీర్వాదం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు నల్లమిల్లి మనోజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవా నర్సరీని సందర్శించిన ఎమ్మెల్యే కమలాకర్

కడియం, జూలై 12: కడియపులంక పుల్లా చంటియ్య-సత్యదేవా నర్సరీని తెలంగాణా కరీంనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సందర్శించారు. మొక్కలు వాటి విశిష్టతలు, పెంపకం వంటి విషయాలను నర్సరీ ఎండీ పుల్లా పెదసత్యనారాయణ వివరించారు. కార్యక్రమంలో ఆర్.సుబ్బరాజు (ఆర్ఎస్ఆర్), ఆర్ గోపీకృష్ణ, గాద వీరన్న, మెర్ల కృష్ణ ఉన్నారు.

ఏపీఆర్ సెట్‌లో భానురేఖకు రెండో ర్యాంక్



అనపర్తి, జూలై 12: ఏపీఆర్ సెట్-2024 పరీక్షల్లో బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామానికి చెందిన టి.భానురేఖ సెకండ్ ర్యాంకు సాధించారు. ఈమె ప్రస్తుతం రాయవరంలోని సాయితేజ విద్యానికేతన్ డైరెక్టర్‌గా వ్యవహ రిస్తున్నారు. ఈమె గతంలో బీటెక్, ఎమ్‌బీఏలలో గోల్డ్ మెడల్ సాధించారు. హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ చేయాలన్న లక్ష్యంతో ఈ పరీక్షలకు దరఖాస్తు చేసినట్టు భానురేఖ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పలువురు నాయకులు అభినందించారు.

సంగీత దర్శకుడు మణిశర్మకు సత్కారం



రాజానగరం, జూలై 12: గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ(జీజీయూ)లో ప్రముఖ సినీ సంగీత దర్శకుడు మణిశర్మ దంపతులకు ఘన సన్మానం జరి గింది. ఈ సందర్భంగా జీజీయూ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) మాట్లాడుతూ తెలుగు ప్రేక్షకులకు ఎంతో సుపరిచితమైన గొప్ప సంగీత దర్శకుడు మణిశర్మ అన్నారు. ఎందరో అగ్రతారల చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించి, ఉత్తమ సంగీత దర్శకుడిగా ఎన్నో పురస్కారాలు అందుకున్నారన్నారు. మణిశర్మ షష్టిపూర్తి సందర్భంగా చైతన్యరాజు, సతీమణి బదరీ లక్ష్మి.. మణిశర్మ దంపతులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. అనంతరం చైతన్యరాజుతో ఉన్న అనుబంధాన్ని మణిశర్మ వివరించారు.

ఉపాధి కల్పనకు నివేదిక సిద్ధం చేయండి

పీఎం విశ్వకర్మపై సమన్వయ శాఖలతో కలెక్టర్ ప్రశాంతి సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, జూలై 12: యువతకు ఉద్యోగ ఉపాధి కల్పనే లక్ష్యంగా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో శుక్రవారం పీఎం విశ్వకర్మపై సమన్వయ శాఖల అధికారులతో సమీక్షించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా అడుగులు వేస్తుందని చెప్పారు. రాజానగరం మండలంలో వుడెన్ క్లస్టర్ యూనిట్స్ ఏర్పాటుకు కలవచర్లలో స్థలం అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు. త్వరలో క్షేత్రస్థాయి పర్యటనకు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్ కార్యాచరణ కింద రానున్న 100 రోజులు, 200 రోజులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ జిల్లా పరిశ్రమల అధికారి పీకేవీ.ప్రసాద్, ఏపీ ఐజీసీ డిప్యూటీ జోనల్ మేనేజర్లు డీవీఎస్ఎన్ జ్యోత్స్నదేవి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిపేట సచివాలయంలో ఎమ్మెల్యే తనిఖీ

కోరుకొండ, జూలై 12: మండలంలోని బుచ్చిపేట గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో ప్రస్తుతం ఉన్న సమస్యలు, ఇబ్బందులు సచివాలయ సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ వీఆర్వో, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, ఇతర సిబ్బంది అందరూ కలిసి కట్టుగా పని చేద్దామని ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ఎన్డీయే నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు అధికారుల దృష్టికి రైతుల సమస్యలు

మండలంలోని మధురపూడిలోని విమానాశ్ర యం నుంచి వచ్చే వరద నీటి వల్ల రైతుల పంట పొలాలు దెబ్బతింటున్నాయని, రైతులు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన వారిని వెంటబెట్టుకుని మోటార్‌సైకిల్‌పై మధురపూడి నుంచి ర్యాలీగా ఎయిర్‌పోర్టుకు వెళ్లి ఏపీడీవోతో రైతుల సమస్యలపై చర్చించారు. శాశ్వత పరిష్కారం చూపే విధంగా అధికారులను ఒప్పించారు. అలాగే అక్కడ డ్రైన్‌లు పరిశీలించి త్వరగా శుభ్రపరచి వాడుకలోకి తీసుకొస్తామని చెప్పారు.

జీవకారుణ్య సంఘంభవనంలోకి అనాథపిల్లలు



రాజమహేంద్రవరం సిటీ, జూలై 11 : లాలాచెరువు రోడ్డులోని గౌతమి జీవకారుణ్య సంఘం అనాథశరణాలయంలో ఉంటున్న బాలలను గోదావరి బండ్‌రోడ్డులోని సంఘం భవనంలోకి గురువారం తరలించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచనలు, దాతల విజ్ఞప్తి మేరకు తరలించినట్టు సంస్థ అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వీవీ. పల్లంరాజు తెలిపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

కోరుకొండ, జూలై 12: మండలంలోని మునగాల యూపీ పాఠశాల ఉపాధ్యాయుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ(ఎండీఎస్) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. కాపవరం గ్రామానికి చెందిన సత్యనారాయణమూర్తికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. 25 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం అనంతరం 98 క్వాలిఫైడ్ ఉపాధ్యాయుడుగా సెలెక్ట్ అయి గత ఏడాది జూన్‌లో మునగాల యూపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధుల్లోకి చేరారు. ఆయన మృతి పట్ల యూటీఎఫ్, పీఆర్టీయూటీ, ఎస్టీయూ, ఎంటీఎస్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

ప్రోటోకాల్ పాటించడం లేదు

బిక్కవోలు సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీల ఆరోపణ

బిక్కవోలు, జూలై 12: అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించడంలేదని పలువురు ఎంపీటీసీలు ఆరోపించారు. బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ బుద్దాల కన్నారావు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాలామృతం కిట్లు, స్కూల్ కిట్లు పంపిణీ వంటి కార్యక్రమాలకు తమను పిలవడం లేదని పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీపీ కన్నారావు మాట్లాడుతూ అధికారులు ప్రోటోకాల్ పాటించాలని సూచించారు. ఆపై జగనన్న కాలనీల్లో రోడ్లు నిర్మించాలని, కాలువలు పూడికతీతలు తీయించాలని పలువురు సభ్యులు కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రొంగల పద్మావతి, వైస్ ఎంపీపీ పెంకే మంగయ్యమ్మ, ప్రత్యేకాధికారి, ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వీయ క్రమశిక్షణను అలవర్చుకోవాలి

దివాన్‌చెరువు, జూలై 12: విద్యార్థులు చిన్ననాటి నుంచే స్వీయ క్రమశిక్షణను అలవర్చుకోవాలని బ్రిగేడియర్ ప్రొఫెసర్ టీవీఎస్‌పీ మూర్తి అన్నారు. నామవరంలోని భారతీయ విద్యాభవన్‌కు శుక్రవారం వచ్చిన ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసం మనిషిని ఉన్నతస్థాయిలో నిలబెడుతుందన్నారు. విద్యార్థి నాయకులకు నాయకత్వ విలువలను వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ శేషగిరిరావు, ప్రిన్సిపాల్ వీరేంద్రనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోరాహోరీగా టేబుల్ టెన్నిస్ పోటీలు

రాజమహేంద్రవరం కల్చరల్ జూలై 12: రాజమహేంద్రవరం నారాయణపురంలో గల ఆర్ఎంసీ సిటీ బాడ్మింటన్ కోర్టులో ఏపి స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఏపీ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్,జిల్లా సంఘ గౌరవ అధ్యక్షుడు విశ్వనాథం భాస్కరరామ్, సిహెచ్ విజయ ప్రకాష్ పోటీలను పర్య వేక్షిస్తున్నారు. ఈ పోటీలకు రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 300 మంది క్రీడాకారులు హాజరై 12 విభాగాల్లో పోటీ పడుతున్నారు. రెండో రోజు అండర్ 17,19 బాలురు, బాలికలు తలపడ్డారు. శనివారం సీనియర్ విభాగం క్రీడాకారులకు బహుమతులు అందజేస్తారన్నారు.

మంత్రి సంధ్యారాణిని కలిసిన టీడీపీ నాయకులు

కడియం, జూలై 12: రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణిని విజయనగరం జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ బీసీసెల్ ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసారు. ఆయన వెంట పార్టీ నాయకులు గుత్తుల శేషగిరి, జోగి చక్రవర్తి, పితాని నారాయణరావు, సూరంపూడి రామకృష్ణ తదితరులున్నారు.

పోస్టల్ ఎస్సీఎస్టీ ఎంప్లాయీస్ సంఘ ఎన్నిక

రాజమహేంద్రవరం సిటీ, జూలై 12: పోస్టల్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. అధ్యక్షుడిగా రాజమండ్రి హెడ్ పోస్టుమాస్టర్ గేదెల సువర్ణరాజు, ప్రధాన కార్యదర్శిగా దానవాయిపేట పోస్టుమాస్టర్ సాధనాల శ్రీనివాసరావు, కోశాధికారిగా హెడ్ పోస్టాఫీసు అకౌంటెంట్ టి.రాజు ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాజమహేంద్రవరం హెడ్ పోస్టాఫీస్ ఆవరణలో రాష్ట్ర ఎస్సీఎస్టీ ఉద్యోగ సంఘం నాయకులు తాళ్ళూరి బాబు రాజేంద్రప్రసాద్, కోరుకొండ చిరంజీవి నూతన కమిటీని ఘనంగా సత్కరించారు.


చెత్తకు చోటిదేనా : రాజమహేంద్రవరంలో రోడ్డు పక్కనే వేసిన చెత్త

ఇలాగుంటే రావా.. రోగాలు


చూడండి..మంత్రి గారూ : నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే దారిలో అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ

డ్రెయినేజీ ఏదీ : తాళ్లపూడి మండలంలోని ఒక గ్రామంలో డ్రెయినేజీ లేకపోవడంతో రోడ్డుపైనే మురుగు


కలెక్టరమ్మా.. ఇదమ్మా : ధవళేశ్వరం పంచాయతీ దగ్గరలో ఉన్న మురుగు కాలువ ఇది.. ఏ కాలంలో చూసినా ఇంతే.. ఎవరికీ పట్టదంతే..

పల్లెలు..పట్టణాలు కంపు కొడుతున్నాయ్..

- వణికిస్తున్న సీజన్
- ప్రబలుతున్న డయేరియా
- అధ్వానంగా గ్రామాలు
- నిర్లక్ష్యం వీడని అధికారులు
- భయంలేకపోవడమే కారణం
- మంత్రిగారి ఇలాఖాలో దారుణం
- ధవళేశ్వరంలో చూస్తే దడదడ
- పట్టించుకోని ప్రత్యేకాధికారి
- నగరంలో కంపు..కంపు
- భయంభయంగా జనం
- 300 పంచాయతీల్లోనూ తీరిది
- ముందస్తు పనులకు వైసీపీ జెల్ల

సీజన్ మారింది.. డయేరియా భయపెడుతోంది.. కలెక్టర్ హెచ్చరికలు చేస్తున్నా గ్రామాల్లో పారిశుధ్య సమస్యకు మోక్షమే కానరావడం లేదు.. గత వైసీపీ ప్రభుత్వంలో ఉన్న నిర్లక్ష్యం అధికారుల్లో నేటికీ వీడలేదు.. ఆ ఎవడొస్తాడు.. ఏం చేస్తాడులే అన్నట్టు అధికారుల తీరు ఉంది.. ఎందుకంటే గత ఐదేళ్లుగా ఎక్కడా బదిలీలు లేవు.. పంచాయతీల్లో ఎక్కడికక్కడ వైసీపీ నాయకుల కనుసన్నల్లో పనిచేసే సిబ్బంది పాతుకుపోయారు.. మామూళ్లకు అలవాటుపడిపోయి మామూలుగా పనిచేసుకుపోతున్నారు. బదిలీలు జరిగితే కానీ భయం రాదు.. ఉన్నతాధికారులు చెప్పేది చెవికెక్కదు. పారిశుధ్య సమస్యకు మోక్షం కలగదు.

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)
జిల్లాలో పట్టణాలు,గ్రామాలు అపారిశుధ్యంతో కొట్టుమి ట్టాడుతున్నాయి.. అడుగడుగునా అపారిశుధ్యమే.. ఇటీవల వచ్చిన కలెక్టర్ ప్రశాంతి..ఒక్క డయేరియా కేసు నమోదు కాకూడదని ఆదేశించారు.. అయితే సీతానగరంలో వరుసగా కేసులు నమోదవుతూనే ఉన్నాయి.. ఈ మేరకు కలెక్టర్ గ్రా మాన్ని సందర్శించారు.ఆమె వస్తున్నారని సమాచారం అం దినా సీతానగరంలో పారిశుధ్యం మెరుగుపర్చలేదంటే ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారనేది అర్థం చేసుకోవచ్చు.. దీనిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసి కార్యదర్శిని సస్పెండ్ చేశారు. ఇటీవల ఒకరు మృత్యువాత కూడా పడ్డారు. అయినా జిల్లా వ్యాప్తంగా ఉన్న అధికారుల తీరులో మాత్రం మార్పులేదు. ఇటీవల ధవ ళేశ్వరంలో పర్యటించి అక్కడి అధికారులపై కూడా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామాలను గాలికొదిలేయడంతో సమస్య వచ్చిపడింది. 14, 15వ ఆర్థిక సం ఘం నిధులను దారి మళ్లించి.. సర్పంచ్‌లతో పాటు పాలకవ ర్గాలను ఉత్సవ విగ్రహాలుగా మార్చేయడంతో పల్లెసీమలు అపారిశుధ్యానికి నిలయంగా మారాయి. జిల్లావ్యాప్తంగా 299 గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేయడానికి డబ్బు లు లేని చిన్న పంచాయతీలు వందకు పైగా ఉండడం గమ నార్హం.రంగంపేట మండలంలో సమస్య ఎక్కువ ఉంది. పంచాయతీ సెక్రటరీల అవినీతి గ్రామాల విధ్వంసానికి ప్రధాన కారణం. పంచాయతీల్లో అయితే చాలా మంది సెక్ర టరీలు డ్రెయినేజీలు క్లీన్ చేశామని..పారిశుధ్య సమస్యలు పరిష్కరించామని.. బీచింగ్,ముగ్గు వంటివి వేశామని చెబు తూ దొంగ బిల్లులు చేసుకునేవారు అనేక మంది ఉన్నారు. ఇదిలా ఉండగా జిల్లా అధికారులు సెక్రటరీల నుంచి నిధులు వసూలు చేసి కొన్ని కార్యాలయాలను ఆధునీకరించుకున్న ఘటనలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో మీకెంత మాకెంత అనే తరహాలోనే పనిచేశారు. నేటికీ ఆ జాడ్యం వీడలేదు.





మంత్రిగారి..ఇలాఖాలోనూ ఇంతే!

నిడదవోలు, జూలై 12 : వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాలకు నేడు పారిశుధ్యం పడకేసింది.దీంతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు.నిడదవోలు మండలంలో సమిశ్రగూడెం మేజర్ పంచాయతీ. సుమారు 10 వేల మంది జనాభా ఉన్న గ్రామం.వైసీపీ ప్రభుత్వంలో డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయకుండా రోడ్లు వేసిన ఘనత వారిది. వైసీపీ నాయకులే కాంట్రాక్టర్లు కావడంతో అధికారులు అటువైపు కన్నెత్తయినా చూడలేదు. సాక్షాత్తూ సమిశ్రగూడెం ప్రధాన రహదారి నుంచి మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే ఈ రహదారిపై డ్రైనేజీ నీరంతా ప్రవహిస్తుంటుంది. ఇళ్లల్లోని వారు బయటకు రావాలంటేనే హడలెత్తే పరిస్థితి. ఈ నేపథ్యంలో గురువారం మంత్రి కందుల దుర్గేష్ ఆ రహదారిలో మురుగు పరిశీలించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే డ్రైనేజీలో సిల్ట్ తొలగించి శుభ్రం చేయించాలని ఆదేశించారు.

డ్రెయినేజీల్లేని తాళ్లపూడి

తాళ్లపూడి, జూలై 12 : తాళ్లపూడిలో పలు ప్రధాన వీధు లు చెత్తతో నిండి దుర్గంధం వెదజల్లుతున్నాయి. మండలంలో వేగేశ్వరపురం నుంచి తాడిపూడి గ్రామం వరకూ యేటి గట్టు వెంబడి ఉన్న ప్రతి గ్రామం అపారిశుధ్యంతో నిండి ఉంది. ఇప్పటికైనా శానిటేషన్ అధికారులు పరిశీలించి వాటిని శుభ్రం చేయించాలని పలువురు కోరుతున్నారు.

ఆర్‌డీవో పాలనలో ఉన్నా.. ధవళేశ్వరంలో కంపు..కంపు

ధవళేశ్వరం, జూలై 12 : కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉంది.. ఆర్‌డీవో స్థాయి అధికారి ప్రత్యేకాధికారిగా ఉన్నారు.. ఆదాయం ఉన్నా ఆ గ్రామం చెత్తతోనే ఉంటుంది. అయినా కన్నెత్తి చూసేవారు లేరు..అదే ధవళేశ్వరం గ్రామం. ఇటీవల కలెక్టర్ ప్రశాంతి పర్యటించి స్థానిక సిబ్బందిపై మండిపడ్డారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ధవళేశ్వరం గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి మురుగునీరు పారక నిలిచిపోవడంతో డ్రైనేజీల నుంచి దుర్వాసన వస్తుంది. లెక్కల్లో ఎంత మంది ఉన్నారో తెలియదు కానీ.. 140 మంది వరకూ పారిశుధ్య సిబ్బంది ఉన్నా ఎప్పుడూ చెత్తతో నిండే ఉంటుంది. డ్రైనేజీలు సిల్ట్‌తో నిండే ఉంటాయి. ప్రణాళికాబద్ధంగా పనులు చేయించాల్సిన శానిటరీ సూపర్‌వైజర్ల నిర్లక్ష్యం, కార్యదర్శి అలసత్వం కారణంగా ప్రజలు అపారిశుధ్య పరిస్థితుల మధ్య జీవనం సాగిస్తున్నారు. సోమవారం గ్రామంలో పర్యటించిన కలెక్టర్, ఎమ్మెల్యే పారిశుధ్య పరిస్థితి మురుగునీరు పారని డ్రైనేజీ వ్యవస్థను చూసి కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.గ్రామంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రూ.3 కోట్లతో మురుగునీటి కాలువల నిర్మాణానికి కార్యాచరణ ప్రణాళిక చేపడుతున్నట్లు ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి ప్రకటించారు. ప్రతి ఏడాది వర్షాకాలం ముందు పారిశుధ్య పనులు చేస్తూనే ఉంటారు.. ఎంతో కొంత మేత మేస్తుంటారు.అయితే అసలు సమస్యను మాత్రం గాలికొదిలేసి కొసరు సమస్య చేస్తున్నారు.ధవళేశ్వరంలో మురుగునీటి పారుదల సక్రమంగా ఉండాలంటే కోరీ కాల్వ శుభ్రం చేయించాల్సిందే. ఎందుకో మరి ఏనాడు అటువైపు చూడరు. నేడు అదే చేస్తున్నారు. డ్రెయినేజీలపై ఆక్రమణలు తొలగించి సిల్ట్ తీయిస్తున్నారు.. ఇంత వరకూ బాగానే ఉన్నా.. కోరీ కాల్వను కూడా శుభ్రం చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


సిల్ట్ తీయరా : రాపాకలో సిల్ట్‌తో నిండిన డ్రెయినేజీ

ముంపున రాజమహేంద్రి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 12 : రాజమహేంద్రవరంలో ప్రధాన డ్రెయినేజీలన్నీ సిల్ట్‌తో నిండి ఉన్నాయి..సీజన్ మారుతున్నా గత ప్రభుత్వంలో ఎటువంటి ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో డ్రెయినేజీలు చెత్తతో నిండిపోయి ఉన్నాయి. నగరంలో ముఖ్యమంగా కృష్ణనగర్, ఆదెమ్మదిబ్బ, రామచంద్రరావుపేట, తుమ్మలోవ ప్రాంతాలు పెద్దపెద్ద డ్రెయినేజీల మధ్యలో ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో డ్రెయినేజీలు ప్రస్తుతం సిల్ట్‌తో నిండిపోయి ఉన్నాయి. అందువల్ల చిన్నపాటి వర్షానికే ఆయా డ్రైనేజీలు పొంగి పొర్లి రోడ్లపై ప్రవహిస్తోంది.సిల్ట్ పేరుకుపోయి పాకు డు కట్టి కంపుకొడుతోంది.సాధారణ రోజుల్లో ఇబ్బంది లేకపోయినా వర్షాకాలంలో మాత్రం ఆయా ప్రాంత వాసులు నరకం చూస్తారు. ఇక్కడ తాగునీటి పైప్‌లైన్లు డ్రైనేజీల గుండా ఉంటాయి. అందు వల్ల ఎక్కడ లీకేజీ ఉన్నా మొత్తం మురుగునీరు వెనక్కిలాగి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.కూటమి ప్రభుత్వం లోనైనా సమస్య పరిష్కరించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.


ఇదేం డ్రెయినేజీ : రాజమహేంద్రి తూర్పు రైల్వే స్టేషన్ వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన డ్రెయినేజీ

ఒకరు చనిపోయినా..మారలే!

సీతానగరం, జూలై 12 : డయేరియా కేసులతో సీతానగరం భయపడుతుంటే సమీప పంచాయతీలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాపాక పంచాయతీ పరిధిలోని రహదారులు డంపింగ్ యార్డులుగా కనిపిస్తుంటే డ్రైనేజీలు నీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతున్నాయి.పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా ఉన్న డ్రైనేజీలో మంచినీటి పైప్‌లైన్ ఊడి పంచాయతీ నీరు డ్రైనేజీలోకి పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.దీని వల్ల మంచినీరు కలుషిమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గోకవరం..పారిశుధ్యం కనం!




దారేది : గోకవరంలో అంగన్‌వాడీ సెంటర్ ఎదుట పేరుకున్న మురుగు, అచ్చుతాపురంలో రోడ్డుపై మురుగు

గోకవరం, జూలై 12 : మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. అసలే వర్షాకాలం. వైరల్, మలేరియా, డెంగీ జ్వరాలతో ఇప్పటికే పలువురు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. డ్రైనేజీల నుంచి మురుగునీరు పారే దారిలేక ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోతుంది. దీంతో దోమలు విస్తారంగా వృద్ధి చెందుతున్నాయి. . రహదారులపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రజలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా పంచాయతీ పాలకులు, అధికారులు మాత్రం పారిశుధ్యంపై దృష్టి సారించడంలేదు.

చీపురుగూడెంలో ఛీ..ఛీ

నల్లజర్ల,జూలై 12 : ఒక వైపు డయేరియా విజృంభణ చేస్తున్నా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడడం లేదు. పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం,చెత్త సేకరణలో అలక్ష్యం వంటి కారణాలతో గ్రామాలు కంపుకొడుతున్నాయి.చీపురుగూడెంలో ప్రధాన రహదారి వెంబడి డ్రైనేజీ నీరు వెళ్ళే మార్గం లేక కంపుకొడుతుంది. సైకిల్ షాపు లక్ష్మణరావు వీధిలో నెల రోజుల నుంచి డ్రైనేజీ పొంగి ప్రవహిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


భరించలేం : చీపురుగూడెంలో డ్రెయినేజీ ఇలా

50 శాతమే వరి నాట్లు పూర్తి

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం, జూలై12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటి వరకూ 50 శాతం వరినాట్లు పూర్తయ్యాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.జిల్లాలో మొత్తం 77,817 హెక్టార్లలో వరి ఆయకట్టు ఉండగా 3576 హెక్టార్ల నారు అవసరం అన్నారు. ఇప్పటి వరకూ 3490 హెక్టార్లలో నారు వేశారన్నారు. జిల్లాలో 39,284 హెక్టార్లలో నాట్లు పూర్తయ్యాయని తెలిపారు. విత్తనాలు వెదజల్లే పద్ధతిలో అనపర్తి, బిక్కవోలు, కోరుకొండ, గోకవరం, సీతానగరం, రంగంపేట మండలాల్లో 598 హెక్టార్లలో సాగు చేశారని చెప్పారు. జిల్లాలోని అన్ని మండలాల్లో 38,686 హెక్టార్లలో నాట్లు వేశారన్నారు.కోరుకొండ, గోకవరం మండలాల్లో ఆగస్టు మొదటి వారం వరకూ నాట్లు పడే అవకాశం ఉన్నట్టు చెప్పారు.జిల్లాలో అనపర్తి, రాజమహేంద్రవరం రూరల్, కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల్లో కొన్ని చోట్ల కొద్దిగా జింక్ లోపం ఉంటుందన్నారు. జిల్లాకు 900 మెట్రిక్ టన్నుల జింక్ అవసరమని అంచనా వేశామన్నారు.

పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టండి

రాజమహేంద్రవరం రూరల్, జూలై 12: పంచాయితీలు, అర్బన్ ప్రాంతాల్లో 100 శాతం పన్నులు వసూలు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. పన్నుల వసూళ్లు, ఉచిత ఇసుక తదితర అంశాలపై శుక్రవారం ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ దినేష్ కుమార్‌తో కలిసి జూమ్ మీటింగ్ నిర్వహించారు.రాజమహేంద్రవరం కార్పొరేషన్, 300 పంచాయతీల్లో రూ.200.27 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా కేవలం రూ.120.19 కోట్లు వసూలు చేశారన్నారు.మిగిలిన మొత్తాన్ని వారం రోజుల్లోగా వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పీఎం విశ్వకర్మ కింద 45 వేల లబ్ధిదారులను నమోదు చేశామన్నారు. వారికి వారం రోజుల పాటు అవగాహన కల్పించాలన్నారు. ఇన్‌చార్జి జేసీ దినేష్ కుమార్ మాట్లాడుతూ ఇసుక సరఫరా సమయంలో భవన నిర్మాణ ప్లాన్ అనుసరించి కేటాయింపులు చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు, మరమ్మతుల విషయంలో టౌన్ ప్లానింగ్ పంచాయతీ అధికారులు ధ్రువీకరణ పత్రం జారీ చేయాలన్నారు. దానికి అనుగుణంగా ఇసుక సరఫరా చేయాలన్నారు.అనధికార లావాదేవీలకు అనుమతిస్తే పంచాయతీ అధికారులను బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. మీటింగ్‌లో డీపీవో డి.రాంబాబు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో డ్రైడే : కలెక్టర్

రాజమహేంద్రవరం, జూలై12(ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల వ్యాప్తి నియంత్రణకు శనివారం జిల్లాలో డ్రైడే పాటిస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్ నుంచి శుక్రవారం ఇన్‌చార్జి జేసీ కె.దినేష్‌కుమార్‌తో కలిసి జిల్లాలోని అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.శాఖల మధ్య సమన్వయం ఎంతో కీలకమని అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇక ప్రతి శుక్రవారం డ్రైడేగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో శనివారం నీటిని తీసి వేసి 5 నుంచి 6 గంటల పాటు పొడిగా ఉంచాలన్నారు. డివిజనల్ స్థాయిలో శనివారం సీజనల్ వ్యాధులపై సమావేశాలు నిర్వహించాలని, హై సెన్సిటివ్ మండలాలను గుర్తించి, ఆయా ప్రాంతాల ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో అన్ని ఆర్వో యూనిట్ల నీటి నమూనాలు తనిఖీ చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించాలన్నారు.సమావేశంలోడీఎంహెచ్‌వో డా.కె.వేంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డా.ఎస్.పి.పద్మశ్రీ, జిల్లా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డా.కె.లక్ష్మీసూర్యప్రభ, డీఈవో కె.వాసుదేవరావు, డీపీవో డి.రాంబాబు, ఆర్ఎంసీ ఎస్ఈ జి.పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క పులస.. రూ.24 వేలు

కోనసీమలో తొలిసారిగా చిక్కిన చేప





మలికిపురం, జూలై 12 : గోదావరి రంగు మారింది.. పులస వచ్చి పడింది.. మత్స్యకారులకు ఆనందం వేసింది.. ఎందుకంటే పులసకు అంతా ఇంతా డిమాండ్ కాదండోయ్.. చిక్కిందా అదృష్టం వలలో పడినట్టే మరి.. ఎందుకంటే దాని రుచే వేరు.. దాని ధరే వేరు.. సాధారణంగా చేప ధర ఎంత ఉంటుంది.. ఏదైనా వెయ్యి నుంచి రూ.500 మధ్యన ఉంటుంది. అయితే పులస ధర మాత్రం వేలల్లో ఉంటుంది.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం రామరాజులంకలో మత్స్యకారుల వలకు శుక్రవారం పులస ధర తెలుసుకుంటే అయ్యబాబోయ్ అనక మానరు. ఏకంగా 2 కిలోల పులస రూ.24 వేలకు విక్రయించారు. గత వారం రోజులుగా గోదావరికి ఎర్రనీరు రావడం ఆరంభమైంది.. సముద్రం నుంచి విలస గోదావరికి ఎదురు ఈదుకుంటూ వచ్చి ఈ నీటిలో పులసగా మారుతుంది. మత్స్యకారులు పులస కోసం ప్రత్యేకంగా వలలు సిద్ధం చేసి గోదావరిలో వేస్తారు. ఇలాగే శుక్రవారం బర్రే శ్రీను అనే మత్స్యకారుడి వలలో పులస చిక్కింది.ఈ మేరకు సమాచారం ఇవ్వడంతో రెండు కిలోల బరువు ఉన్న ఈ పులసను సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంకకు చెందిన మాజీ సర్పంచ్ బర్రే శ్రీను రూ.24వేలకు కొనుగోలు చేశాడు.

క్షయ బాధితులు పోషకాహారం తీసుకోవాలి

జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్ వసుంధర



పీహెచ్‌సీలో సిబ్బందికి సూచనలు అందిస్తున్న డాక్టర్ వసుంధర

ఉండ్రాజవరం, జూన్ 12: క్షయ బాధితులు పోషకాహారం తీసుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా ఎయిడ్స్ క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్ వసుంధర పేర్కొన్నారు. శుక్రవారం ఉండ్రాజవరం పీహెచ్‌సీని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షయ బాధితులు పోషకాహారం, మందులు తీసుకుంటే వ్యాధి త్వరగా తగ్గుతుందని చెప్పారు. వర్షాకాలంలో ప్రజలు కాచిచల్లార్చిన నీటిని తాగేలా సిబ్బంది ప్రచారం చేయాలన్నారు. వాటర్ ట్యాంకుల్లో విధిగా క్లోరినేషన్ చేయించాలన్నారు. క్లోరినేషన్ లాగ్ బుక్ నిర్వహణ జరగాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. క్షయ బాధితుల రికార్డులను, మందులు పంపిణీని తనిఖీ చేశారు.. గర్భిణుల నమోదు రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రసాద్, ఉషాదేవి, సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, పీహెచ్ఎన్ కేడీవీ కుమారి సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ వాడకంతో దుష్పరిణామాలు

తాళ్లపూడి, జూలై 12: డ్రగ్స్ వాడకంపై నష్టాలు వాటి పరిణామాలపై తహశీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఇటీవల మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు మండలంలో గంజాయి వినియోగంలో ఉందని వెంటనే వాటిపై చర్యలు తీసుకోవాలని కోరిన మీదట అన్ని శాఖలకు తెలియపరిచి తహశీల్దార్ ప్రత్యక్ష కార్యాచరణ మొదలుపెట్టారు. సోమవారం నుంచి ప్రతి పాఠశాల, కళాశాలల్లో గంజాయి రహిత సమాజం కోసం మనం అనే నినాదంతో అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు బాలామణి, నెహ్రూజీ, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ వ్యక్తి మృతి

పెరవలి, జూలై 12: ఖండవల్లికి చెందిన భీమనాది సోమేశ్వరరావు(46) పచ్చగడ్డి కోసుకొని వస్తూ జారిపడి గాయపడగా అనంతరం ఆసుపత్రిలో చికిత్స తీసుకుని మృతి చెందాడు. ఎస్ఐ ఏజీఎస్ మూర్తి వివరాల ప్రకారం.. సోమేశ్వరరావు వ్యవసాయ కూలీగా పని చేస్తూ గేదెలు మేపుకుని జీవిస్తుంటాడు. ఈ నెల 9న గోదావరి లంక పొలాల్లో పచ్చగడ్డి కోసుకుని మోపు నెత్తిపై పెట్టుకుని గోదావరి గట్టు వెంబడి వస్తుండగా వర్షం కురడంతో గట్టుపై బురదగా ఉండి ఆ బురదలో ప్రమాదవశాత్తూ జారి కింద పడిపోయాడు. దీంతో అతని వెన్నెముకకు బలమైన గాయం కావడంతో తొలుత తణుకు ఆసుపత్రికి, అనంతరం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో నయం కాకపోవడంతో ఈనెల 12న ఇంటికి తీసుకురాగా 12వ తేదీ తెల్లవారుజామున మృతిచెందినట్టు ఆయన భార్య రాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. కాగా సోమేశ్వరరావు దంపతులకు ఇద్దరు కుమారులున్నారు.

ఆధార్ కేంద్రాలు పనిచేయక ఇబ్బందులు



అన్నదేవరపేటలో నిర్వహిస్తున్న ఆధార్ సెంటరు

తాళ్లపూడి, జూలై 12: మండల కేంద్రంలో ఆధార్ సేవలు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు. మండలంలో తాళ్లపూడి, మలకపల్లి, అన్నదేవరపేటలో ఆధార్ కేంద్రాలు నిర్వహించే వారు. ప్రస్తుతం పనిచేసేది మాత్రం ఒక్కటే. మండల కేంద్రంలో పనిచేయకపోవడం గమనార్హం. ఆధార్ సెంటర్ల నిర్వహణపై అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఎవ్వరికి ఆధార్ సేవలు కావాలన్నా అన్నదేవరపేట వెళ్లాల్సిందే. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిగిలిన సెంటర్లలో కూడా ఆధార్ సేవలు పునఃరుద్ధరించాలని అధికారులను కోరుతున్నారు.

ఉసులుమర్రులో ఇసుక స్టాక్ పాయింట్ పరిశీలన



ఇసుక పాయింట్ వద్ద వివరాలు తెలుసుకుంటున్న రవాణా శాఖాధికారి మహ్మద్ జమీర్

పెరవలి, జూలై 12: ఉసులుమర్రులో ఇసుక స్టాక్ పాయింట్‌ను కొవ్వూరు రవాణా శాఖ అధికారి మహ్మద్‌జమీర్ శుక్రవారం పరిశీలించారు. లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఉపయోగిస్తున్న ట్రాక్టర్లు, లారీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇసుక సరఫరా చేసే వాహనాలన్నింటికీ నిబంధనల మేరకు అన్ని అనుమతులు ఉండాలని, లేకుంటే సదరు వాహనాలపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్టాక్ పాయింట్ ఇన్‌చార్జి సన్నిబాబు, వీఆర్‌వో సుబ్బారావు, రవికుమార్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కృష్ణమ్మగూడెంలో ఫ్లెక్సీ వివాదం

నల్లజర్ల, జూలై 12: మండలంలోని కృష్ణమ్మగూడెం ఎస్సీ కాలనీలో మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్ యూత్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని దుండగులు బ్లేడ్‌తో చించివేశారు. దీంతో ఫ్లెక్సీ చించివేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు బొట్టా నాగేశ్వరరావు శనివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ దుర్గాప్రసాద్ గ్రామంలోకి వెళ్లి ఎవరు గొడవలు పెట్టుకోవద్దని, ఫ్లెక్సీ చించిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వృద్ధాశ్రమానికి గోపాలపురం ఎస్ఐ ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న ఎస్ఐ సతీష్ దంపతులు

దేవరపల్లి, జూలై 12: మండలంలోని గొల్లగూడెంలో లగడపాటి రామలక్ష్మమ్మ, రామానాయుడు దివ్యాంగుల, వృద్ధాశ్రమంలో జనరేటర్ నిమిత్తం గోపాలపురం ఎస్ఐ కె.సతీష్ ఆర్థిక సాయం అందజేశారు. ఆయన సతీమణి హేమ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం రూ.25 వేలు ఆశ్రమ ఛైర్మన్ కాగిత భాస్కరరావుకు అందించారు.

నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



ఉండ్రాజవరం, జూలై 12: ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని పాలంగి సర్పంచ్ బొక్కా శ్రీనివాస్ పేర్కొన్నారు. డ్రైడే ఫ్రైడే సందర్భంగా శుక్రవారం గ్రామంలో పలు ప్రాంతాల్లో మురుగు డ్రైన్లు, నీరు నిల్వ ఉండే గుంటల్లో యాంటీ లార్వా ఆపరేషన్‌లో భాగంగా దోమలు పెరగకుండా ఆయిల్ బాల్స్‌ను వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ ప్రజలకు మురుగుడ్రైన్లలో చెత్తచెదారాలు వేయరాదని సూచించారు. డెంగ్యు, మలేరియా, ఫైలేరియా, టైఫాయిడ్, చికిన్‌గున్యా వంటి మొదలకు జ్వరాలు రాకుండా ఉండాలంటే దోమలు నివారణ చేపట్టాలని వైద్య సిబ్బంది ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహ్మద్ హసన్‌జాని, వైద్య సిబ్బంది కాపా నాగరాజు, వెంకమ్మ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కురిసింది వాన

నిడదవోలులో నీట మునిగిన ఆర్టీసీ బస్టాండ్.. ప్రయాణికుల ఇక్కట్లు



వర్షానికి నిడదవోలులో నీట మునిగిన ఆర్టీసీ బస్టాండ్ ↑

నిడదవోలు, జూలై 12: నిడదవోలులో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి స్థానిక ఆర్టీసీ డిపో జలమయమయ్యింది. డిపో నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చేయించిన పనుల్లో నాణ్యతా లోపమే డిపో వర్షపు నీటిలో మునిగిపోవడానికి కారణమని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. పట్టణంలోని డ్రైన్లు సైతం పొంగి పొర్లాయి.

కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

కొవ్వూరు, జూలై 12: గురువారం రాత్రి కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో ఐదు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఆసుపత్రి ప్రహరి బయట వైపు సత్యసాయి మందిరం రోడ్‌లో ఉన్న చెట్టుకొమ్మలు విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న ఐదు స్తంభాలు నెలకొరిగాయి. దీంతో ఆసుపత్రి, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆసుపత్రి సూపరింటెండెంటు డాక్టర్ కె.సాయికిరణ్ ఫిర్యాదు మేరకు ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. ఏఈ సీహెచ్. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చెట్టుకొమ్మలను, విద్యుత్ స్తంభాలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. విరిగిన స్తంభాల స్థానంలో క్రొత్త వాటిని నిలబెట్టి సరఫరాను పునరుద్ధరించారు.



← కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి వద్ద కూలిన విద్యుత్ స్తంభం

రైతులకు ఆర్థిక పరిపుష్టి కలిగించడమే ధ్యేయం

» ఎమ్మెల్యే మద్దిపాటి.. కొబ్బరి ఉత్పత్తుల కొనుగోళ్లు ప్రారంభం



గోపాలపురం ఏఎంసీలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, జూలై 12: వ్యవసాయ రంగానికి సాంకేతిక పరిజ్ఞానం జోడించి వినూత్నమైన మార్పులతో రైతు పండించే ప్రతీ ఉత్పత్తిని కొనుగోలు చేసి ఆర్థిక పరిపుష్టి కలుగజేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో (నాఫెడ్ ఆయిల్‌ఫెడ్) కొబ్బరి ఉత్పత్తుల కొనుగోళ్ల కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. అలాగే ఉపాధి హామీ పథకంలో ఏర్పాటు చేసిన పలు పండ్ల మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా రైతుకు ఆర్థిక పరిపుష్టి లభిస్తుందన్నారు. గోపాలపురం మార్కెట్‌కమిటీ యార్డును విస్తరించి నాలుగు మండలాల్లోని రైతులకు ఉపయోగపడేలా కృషి చేస్తానని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ధరల స్థిరీకరణ నిధి పేరుతో రూ.2 వేల కోట్లలు దోచేశారన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో రైతు పండించిన ప్రతీ పంటకు గిట్టుబాటు ధర కల్పించి రాయితీలతో కూడిన సాంకేతిక పరికరాలను రైతులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, జ్యేష్ట శ్రీధర్, ఎంపీడీవో కే.రమేష్‌బాబు, కొర్లపాటి రాము, కొర్లపాటి అన్నవరం, గన్నిన మురళీ, సత్యనారాయణ, ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జడ్పీటీసీ కాకులపాటి లత, కూనపం ప్రసాద్‌బాబు, దాసరి రవి, ముత్యాల రాయుడు, గుడ్డిగూడెం ఎంపీటీసీ ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిడదవోలు, జూలై 12: మండలంలోని కాటకూటేశ్వరం, పురుషోత్తపల్లి సబ్‌స్టేషన్లలో వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ నెల 13న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. పురుషోత్తపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని పురుషోత్తపల్లి, విజ్జేశ్వరం, గోపవరం, పందలపర్రు, రావివారిగూడెం, డి.ముప్పవరం, కలవచర్ల, జీడిగుంట, కోరుపల్లి, మునిపల్లి, పెండ్యాల గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు..కాటకూటేశ్వరం సబ్‌స్టేషన్ పరిధిలో కాటకూటేశ్వరం, సూరాపురం, ఉనకరమిల్లి, తిమ్మరాజుపాలెం, లింగంపల్లి, శంకరాపురం, రావిమెట్ల, కంసాలిపాలెం, రామచంద్రాపురం, కలవలపల్లిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ పేర్కొన్నారు.

పెరవలి: కానూరు సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ఈఈ వీరభద్రరావు తెలిపారు. కానూరు పరిధిలో వ్యవసాయ బోర్లకు త్రీఫేజ్ కరెంటు ఉదయం 5నుంచి 9గంటలు, మధ్యాహ్నం 1నుంచి సాయంత్రం 5గంటలకు ఇస్తామన్నారు. తీపర్రు ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం ఉదయం 9నుంచి 4గంటల వరకు సరఫరా నిలిపి వేస్తామన్నారు. దీంతో పెరవలి, అజ్జరం, కాకరపర్రు, వెంకటరాయపురం, తీపర్రు గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ ఉదయం 4నుంచి 9గంటల వరకు, సాయంత్రం 4నుంచి 6గంటల వరకు ఇస్తామని చెప్పారు.

నల్లజర్ల: నల్లజర్ల, పోతవరం సబ్‌స్టేషన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నల్లజర్ల, జగన్నాథపురం, మారెళ్ళమూడి, పోతవరం, కవులూరు, సుభద్రపాలెం, నబీపేట, కృష్ణయ్యగూడెం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ వీరభద్రరావు తెలిపారు.

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరు, గౌరీపట్నం గ్రామాల్లో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 8గంటల నుంచి 2గంటల సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ కె.కృష్ణారావు తెలిపారు.

చాగల్లు: చాగల్లు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం చాగల్లు, నెలటూరు, మీననగరం, ఊనగట్ల, అమ్మిగుంట, వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ట్రాన్స్‌కో ఈఈ తెలిపారు.

గురుకుల పాఠశాలల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో మొక్కు తీర్చుకుంటున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూలై 12: గురుకుల పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తానని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కుమారదేవంలో బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు వచ్చే దొమ్మేరు-కుమారదేవం రహదారి అధ్వానంగా ఉందని, పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిందని అదనంగా 4 తరగతి గదులు అవసరమని కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను విన్నవించారు. ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ విద్యార్థులు ఆడుకోవడానికి ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు. క్లబ్ తరఫున గురుకుల పాఠశాలలోని క్రీడా ప్రాంగణాన్ని ఎర్రమట్టితో లెవెలింగ్ చేసి అప్పగిస్తారన్నారు. రహదారి, అదనపు తరగతి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటానన్నారు. పాఠశాలలో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.10 వేలు నగదు బహుమతి అందజేస్తానన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కంఠమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, ఎంపీపీ కాకర్ల నారాయుడు, వట్టికూటి వెంకటేశ్వరరావు, సూరపనేని చిన్ని, సర్పంచ్ మేకల శ్రీను, గొరిజాల సురేష్, ఎంపీటీసీ ఎరుబండి సురేష్ పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీగణపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే ముప్పిడి

బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో ఎమ్మెల్యే ముప్పిడి మొక్కు తీర్చుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు, కొవ్వూరు ఎమ్మెల్యేగా ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎంపీగా దగ్గుబాటి పురందేశ్వరి విజయం సాధిస్తే పటిక బెల్లం మొక్కు తీర్చుకుంటామని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా నాయకులు గోపిశెట్టి భువనేశ్వరి, శివకృష్ణ మొక్కుకున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే ముప్పిడి చేతుల మీదుగా పటిక బెల్లం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చాగల్లు, జూలై 12: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం చాగల్లులోని మహిళా సమాఖ్య భవనంలో జరిగిన వీవోఏ, సీసీలు, వోబీలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ మహిళలు స్వయం సమృద్ధిని సాధించాలనే లక్ష్యంతో చంద్రబాబు డ్వాక్రా పథకాన్ని అమలు చేశారని, చంద్రన్న బీమా పథకం పేదలకు అండగా ఉంటుందని అన్నారు. సచివాలయాల సిబ్బందితోను ఆయన మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఆళ్ల హరిబాబు, కూటమి నాయకులు దొంగ రామకృష్ణ, జొన్నకూటి సుబ్బారావు, ఊబా దుర్గ, మిరియాల సతీష్, తాళ్ళూరి వరప్రసాద్, ఐకేపీ ఏపీఎం మంగాయమ్మ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు డొక్కు లక్ష్మీపార్వతి తదితరులు పాల్గొన్నారు.

పట్టాదారులకు న్యాయం జరిగే వరకు పోరాటం

న్యాయవాది విజయభాస్కర్‌రెడ్డి

గోపాలపురం, జూలై 12: మండలంలోని భీమోలు గ్రామంలో ల్యాండ్ సీలింగ్ మిగులు భూముల్లో పట్టాలు పొందిన పట్టాదారులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని న్యాయవాది (లీగల్ అడ్వైజర్) విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని భీమోలులో కాకులపాటి శ్రీను నివాసంలో పట్టాదారులు, మద్దతుదారులతో కలిసి శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ల్యాండ్‌సీలింగ్‌లో భాగంగా భీమోలులో ఉన్న మిగులు భూమిని కొన్నేళ్ల క్రితం భూముల్లేని పేదలకు అప్పటి అధికారులు పట్టాలిచ్చారన్నారు. అయితే కొందరూ వ్యక్తులు, అదే భూమికి కౌలుదారులు కలిసి ఆ భూమి మాదంటే మాదని న్యాయస్థానాలను ఆశ్రయించారన్నారు. కౌలుదారులు, పట్టాదారులు ఒకే భూమిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్టు తెలిపారు. ఆ భూములను రెవెన్యూ అధికారులు యుద్ధప్రాతిపదికన కౌలుదారుల పేరున ఆన్‌లైన్ చేసినట్టు ఆరోపించారు. వెనువెంటనే ఆ భూములు రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. పట్టాదారులకు న్యాయం జరిగే వరకు న్యాయస్థానాల్లో పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో కొడవటి బుజ్జిబాబు, సాలి వేణు, పట్టాదారులు కాకులపాటి వెంకట్రావు, మధు, వేములూరి చినవెంకట్రావు, చాపల వెంకట్రావు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కొవ్వూరు, జూలై 12: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ జీజీ ప్రకాష్ తెలిపారు. చాగల్లు మండలం దారవరం గ్రామానికి చెందిన జంగం శేషగిరి ఈ నెల 10వ తేదీన ఇంటినుంచి బయటకు వచ్చి తిరిగి వెళ్లలేదు. కొవ్వూరు మండలం వాడపల్లి వశిష్ట పాఠశాల ఎదురుగా ఉన్న ఇసుక ర్యాంపులో గుర్తుతెలియని బైక్ కనిపించింది. దీంతో పోలీసులు విచారణ చేపట్టి శేషగిరి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వచ్చి బైక్ శేషగిరిదేనని ధ్రువీకరించారు. శేషగిరి సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు. కాగా శేషగిరికి భార్య ఇద్దరు పిల్లలు. భార్య కువైట్‌లో ఉంటోంది.

పేకాడుతున్న 18 మందిపై కేసు

కొవ్వూరు, జూలై 12: కొవ్వూరులో పేకాట శిబిరంపై దాడిచేసి రూ.1,51,950 స్వాధీనం చేసుకున్నట్టు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. గురువారం రాత్రి రోడ్డు కం రైలు బ్రిడ్జి సమీపంలో పేకాట ఆడుతున్న సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేశామని, 18మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,51,950 స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు.

సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే ఫిర్యాదు చేయండి

ఉండ్రాజవరం, జూలై 12: సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని ఎస్ఐ వి.అప్పలరాజు తెలిపారు. మొబైల్ చోరీకి గురైతే వాటిని రికవరీ చేసేందుకు ప్రత్యేక టీములను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రజలు తమ సెల్‌ఫోన్లు చోరీకి గురైనా, పోగొట్టుకున్నా వాటికి సంబంధించిన బిల్లు, ఐఎమ్ఈఐఈ నెంబరు, తమ ఆధార్‌కార్డుతో పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసి సంబంధిత వ్యక్తులకు అందజేసినట్టు చెప్పారు.

వివాహితపై కట్నం వేధింపులు

కొవ్వూరు, జూలై 12: భర్త, అతని బంధువులు వేధిస్తున్నారని వివాహిత ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ జె.శ్రీనివాస్ తెలిపారు. కొయ్యలగూడెం మండలం డిప్పకాయలపాడు గ్రామానికి చెందిన నళినికి 2017లో కాపవరం గ్రామానికి చెందిన పత్తి సురేష్‌తో వివాహమైంది. కొవ్వూరులో నివాసం ఉంటున్నారు. భర్త సురేష్, అన్నకొడుకు రమేష్, ఆడపడుచు పోశమ్మ ఆమె కుమారుడు మహేష్ అధికకట్నం కోసం వేధిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొవ్వూరు, జూలై 12: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కాకినాడ జిల్లా గండేపల్లికి చెందిన గండేపల్లి వెంకటరమణ చాగల్లు నుంచి స్కూటీపై స్వగ్రామం బయలుదేరాడు. కొవ్వూరు ఏషియన్ పేయింట్స్ గొడౌన్ సమీపానికి చేరుకునే సరికి మోటారుసైకిల్ అదుపుతప్పి కింద పడిపోయాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

డిక్కీలో పెట్టిన రూ.5.20 లక్షలు మాయం

కొవ్వూరు, జూలై 12: బైక్ డిక్కీలో పెట్టిన రూ.5.20 లక్షలు నగదు దుండగులు అపహరించినట్టు బాధితుడు వాపోతున్నాడు. అనపర్తి మండలం మహేంద్రవాడకు చెందిన కర్రి సూర్యనారాయణరెడ్డి శుక్రవారం చాగల్లులో స్థలం విక్రయించడానికి వచ్చాడు. స్థలం కొనుగోలు చేస్తున్న వ్యక్తి అడ్వాన్సుగా రూ.5 లక్షలు ఇచ్చాడు. సొమ్ము తీసుకుని ఇంటికి బయలుదేరాడు. దొమ్మేరు గ్రామశివారు చౌదరి హోటల్ వద్ద మధ్యాహ్నం 3గంటల సమయంలో భోజనానికి ఆగాడు. భోజనం చేసి అక్కడే కొంతసేపు కూర్చుని అడ్వాన్సుగా ఇచ్చిన సొమ్ము లెక్క చూసుకున్నాడు. అరగంట తరువాత అడ్వాన్సు సొమ్ము రూ.5 లక్షలు, తన వద్ద ఉన్న రూ.20 వేల నగదును బ్యాగ్‌లో పెట్టి మోటారుసైకిల్ డిక్కీలో పెట్టుకుని మరలా ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో దొమ్మేరులోని టీ టైమ్ వద్ద ఆగాడు. టీ తాగి వచ్చి డిక్కీలో ఉంచిన సొమ్ము చూసుకుంటే డబ్బు బ్యాగ్ కనిపించకపోవడంతో బాధితుడు పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. సమాచారం తెలుసుకున్న సీఐ వి.జగదీశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని సూర్యనారాయణరెడ్డి భోజనం చేసిన హోటల్, టీ తాగిన టీటైమ్‌తో పాటు మెయిన్‌రోడ్‌లోని దుకాణ యజమానులను, స్థానికులను విచారణ చేశారు. గుర్తుతెలియని యువకుడు చొక్కాలో ఏదో దాచుకుని వెళ్తున్నట్టు చూశామని స్థానికులు పోలీసులకు చెప్పినట్టు సమాచారం.

ఉపాధి కల్పనకు నివేదిక సిద్ధం చేయండి

పీఎం విశ్వకర్మపై సమన్వయ శాఖలతో సమీక్షలో కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, జూలై 12: యువతకు ఉద్యోగ ఉపాధి కల్పనే లక్ష్యంగా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో శుక్రవారం పీఎం విశ్వకర్మపై సమన్వయ శాఖల అధికారులతో సమీక్షించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా అడుగులు వేస్తుందని చెప్పారు. రాజానగరం మండలంలో వుడెన్ క్లస్టర్ యూనిట్స్ ఏర్పాటుకు కలవచర్లలో స్థలం అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు. త్వరలో క్షేత్రస్థాయి పర్యటనకు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్ కార్యాచరణ కింద రానున్న 100 రోజులు, 200 రోజులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ జిల్లా పరిశ్రమల అధికారి పీకేపీ.ప్రసాద్, ఏపీ ఐజీసీ డిప్యూటీ జోనల్ మేనేజర్లు డీవీఎస్ఎన్ జ్యోత్స్నదేవి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి

74 వేల క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల

రాజమహేంద్రవరం సిటీ, జూలై 12 : ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరి నదీ వరద ప్రవాహనం క్రమంగా పెరుగుతుంది. ప్రతి ఏటా గోదావరికి జూలై ,ఆగస్టు నెలల్లో వరదలు వస్తాయి. మహారాష్ట్ర లో వర్షాలు కురవడంతో ప్రవాహం సాధారణ స్థాయికి మించి ప్రవహిస్తోంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 74 వేల క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. పుష్కరాల రేవు వద్ద గోదావరి నీటిమట్టం 45 అడుగులకు చేరింది. ఈ నెలాఖరుకు గోదావరి వరద పోటెత్తే అవకాశం ఉంది.

మార్కెట్‌ను ముంచెత్తిన ఆనబకాయలు

రైతు బజార్లలో ఒక్కో కాయ రూ.17కు విక్రయం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 12: ఆనబకాయలు శుక్రవారం మార్కెట్లను ముంచెత్తాయి. దిగుబడికి వాతావరణం పూర్తిగా అనుకూలించడంతో రైతులు భారీ ఎత్తున ఆనబకాయలను మార్కెట్లకు తీసుకొస్తున్నారు. రాజమహేంద్రవరం క్వారీమార్కెట్ రైతు బజార్‌కు శుక్రవారం సీతానగరం ప్రాంతానికి చెందిన రైతు కూనవరం శ్రీను తన పొలంలో సాగు చేసిన ఆనబకాయలను విక్రయానికి తీసుకొచ్చాడు. భారీగా రాశి పోసి విక్రయాలు సాగించాడు. రైతుబజార్ అధికారులు రైతుకు గిట్టుబాటు ధర కల్పించడానికి ఒక్కో ఆనబకాయకు రూ.17లు ధర పెట్టారు. పొలంలో మరిన్ని ఆనబకాయలు కోతకు సిద్ధంగా ఉన్నాయని రైతు శ్రీను తెలిపాడు. ఇలా ఒక్కసారిగా ఇబ్బడిముబ్బడిగా వచ్చే కూరగాయల విషయంలో మార్కెటింగ్‌శాఖ అధికారులు దృష్టి సారించి సర్‌ఫ్లస్‌గా ఉన్న సరుకును రైతుల నుంచి సేకరించి ఇతర రైతుబజార్లకు సర్దుబాటు చేయగలిగితే అటు రైతుకు, ఇటు వినియోగదారునికి మేలు కలుగుతుందనే భావన వ్యక్తమవుతోంది.

వచ్చే నెల 25న జాంపేట అర్బన్ బ్యాంక్ ఎన్నికలు

రాజమహేంద్రవరం, జూలై 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్బన్ బ్యాంక్‌ల ఎన్నికల సందడి మొదలైంది. ఇప్పటికే ఆర్యాపురం కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ నడుస్తోంది. ఈనెల 20న పోలింగ్ జరగనుంది. మరో పక్క రాజమహేంద్రవరం కేంద్రంగా పలు ప్రాంతాలకు విస్తరించి ఉన్న జాంపేట కో ఆపరేటి అర్బన్ బ్యాంక్ ఎన్నికల ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆగస్టు 25న ఎన్నికలు జరుగుతాయి. ఆగస్టు 16న నామినేషన్లు స్వీకరిస్తారు. 17న వాటిని పరిశీలించి 18న ఉపసంహరణ ముగిసిన వెంటనే పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి పి.ప్రశాంతి ఈ నెల 8న నోటిఫికేషన్ జారీ చేశారు. ఎన్నికల అధికారిగా రాజమండ్రి డివిజనల్ సహకార అధికారి ఎం.జగన్నాథరెడ్డిని నియమించారు. జాంపేట అర్బన్ బ్యాంక్‌కు 10 బ్రాంచిలున్నాయి. జాంపేట ప్రధాన బ్రాంచి కాగా, మోరంపూడి, ధవళేశ్వరం, సీతంపేట, అనపర్తి, పెద్దాపురం, కాకినాడ, గోకవరం, ఏలూరు, కొవ్వూరులలో బ్రాంచిలున్నాయి.దీని పాలకవర్గం కోసం 12మంది డైరెక్టర్లను ఎన్నుకోవాలి. ఈ బ్యాంక్ పరిధిలో మొత్తం 30,815 మంది ఓటర్లున్నారు.

జూనియర్ కళాశాలలకు మౌలిక సదుపాయాల కల్పన

దేవరపల్లి, జూలై 12: ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు అన్ని మౌలిక సదు పాయాలు ఏర్పాటు చేయనున్నట్టు విద్యాశాఖాధికారి జేవీవీ సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం మండలంలోని యర్నగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వ మిచ్చిన పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఛత్రపతిశివాజీ, టీడీపీ నాయకులు భాస్కర్, పెనుమత్స సుబ్బరాజు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	కల్కి
వై.స్క్రీన్2	మహారాజ
దేవిశ్రీ(గాయత్రి)	హరోంహర
అనన్య	తమ్ముడు

నిడదవోలు

వీ మ్యాక్స్	కల్కి
రాధాకృష్ణ	కల్కి
శ్రీగణపతి	కల్కి

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	గంగం గణేశా
స్క్రీన్ 2	---
శ్రీనివాస	---